నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
ఆదిలాబాద్
1
సోమవారం | జులై 08, 2024 | www.navatelangana.com

మాజీ జెడ్పీటీసీకి చిన్ననాటి మిత్రుల సన్మానం

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్



మావల జెడ్పీటీసీ నల్ల వనితారాజేశ్వర్ పదవీకాలం ముగియడంతో చిన్ననాటి మిత్రులు కలిశారు. ఆదివారం మావలలోని స్వగృహంలో రాజేశ్వర్‌ను కలిసి శాలువాతో సత్కరించారు. పదవికే విరామం కానీ ప్రజా సేవకు కాదని, ప్రజా శ్రేయస్సు కోసం పాటుపడాలని చిన్ననాటి మిత్రులు కోరారు. అలాగే పూర్వ విద్యార్థులు, మీడియా మిత్రులు ఆయనను ఘనంగా సన్మానించారు. సన్మానించిన వారిలో మిత్రులు చొప్పదండి శ్రీనివాస్, దర్శనాల అశోక్, ఓరగంటి శ్రీనివాస్, దత్తాత్రే, అనిల్ రావ్, గాజరి మహేష్, సుదర్శన్, ఉశన్న, ఫిరోజ్, బాలాజీ, తోట రమేష్, చింతల అరుణ్ రెడ్డి, వడల కిరణ్ రెడ్డి, అందుగుల రాజేందర్ ముదిరాజ్ పాల్గొన్నారు.

ఇంటి పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలి

నవతెలంగాణ-ఉట్నూర్



ఇంటి పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని మాజీ ఎంపీపీ పంద్ర జైవంత్‌రావు అన్నారు. ఆదివారం మండలంలోని చెప్రాల గ్రామంలో సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించారు. వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రత పాటించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు పాల్గొన్నారు.

వైన్స్ షాపులో దొంగతనం



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

పట్టణంలోని రెండు వైన్స్ షాపుల్లో చోరీ ఘటనలు ఆదివారం వెలుగు చూశాయి. పట్టణంలోని విద్యాగనర్‌లోని బాలాజీ వైన్స్, శివాజీచౌక్‌లోని తిరుమల వైన్స్‌లో శనివారం రాత్రి సమయంలో దొంగలు దుకాణం షెటర్లకు ఉన్న తాళాలను పగలగొట్టి లోనికి వెళ్లి దొంగతనానికి పాల్పడ్డారు. రాత్రి గస్తీ చేస్తున్న పోలీసులు గమనించి, యజమానులకు సమచారం అందించారు. విషయం తెలుసుకున్న వారు వెంటనే అక్కడి చేరుకున్నారు. తిరుమల వైన్స్‌లో మద్యం బాటిళ్లు ఎత్తుకెళ్లారు. బాలాజీ వైన్స్‌లో దాదాపు రూ.50 వేల నగదను ఎత్తుకెళ్లినట్టు యజమాని తెలిపారు. రాత్రి పోలీసుల సమచారంతోనే ఇక్కడి వచ్చామని షాపులో నగదును మాయమైందని మందు బాటిళ్లు తీసుకెళ్లలేదని తెలిపారు. ఆదివారం కావడంతో ముందస్తుగా దుకాణంలో పది, ఇరవై రూపాయల నోట్లను దాదాపు రూ.50 వేల వరకు పెట్టామని, అవి దొంగతనం జరిగినట్టు తెలిపారు. ఈ మేరకు బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేయగా, యజమానుల నుంచి పోలీసులు వివరాలు సేకరించి, కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నారు.

సీఎంఆర్ఎఫ్ పేదలకు వరం

- ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్



నవతెలంగాణ-ఉట్నూర్

పేద, మధ్యతరగతి ప్రజలకు సీఎంఆర్ఎఫ్ పథకం ఒక వరమని ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ అన్నారు. ఆదివారం హైదరాబాద్‌లోని ఎమ్మెల్యే క్వాటర్స్‌లో జన్నారం మండలంలోని కిష్టాపూర్ గ్రామానికి చెందిన ఎం.రాజేష్‌కు సీఎంఆర్ఎఫ్ తక్షణ సహాయ నిధి నుంచి రూ.2లక్షల 50వేల ఎల్‌ఓసీని మంజూరు చేసి వారి కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆపరేషన్‌కు లక్షల్లో వైద్యం చేసుకోలేకపోతున్న పేద ప్రజలకు సీఎంఆర్ఎఫ్ సహాయనిధి ఎంతగానో ఉపయోగపడుతోందని పేర్కొన్నారు. పేద ప్రజల వైద్యానికి ఖర్చును ప్రభుత్వమే భరిస్తుందని, వైద్యానికి ప్రాధాన్యత ఇస్తున్న సర్కార్ తమదని తెలిపారు. ప్రజా సంక్షేమమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం పని చేస్తుందని, ప్రజలకు అన్ని విధాలుగా అండగా ఉంటుందని తెలిపారు. ఆరోగ్య శ్రీ పథకం రూ.5 లక్షల నుంచి రూ.10 లక్షల వరకు పెంచిన ఘనత కాంగ్రెస్‌దేనని అన్నారు.

పరీక్ష ఫీజు చెల్లింపు గడువు పొడగింపు

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

డా.బీఆర్ అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీలో పీజీ ప్రథమ, ద్వితీయ సంవత్సరం వార్షిక పరీక్ష ఫీజు చెల్లింపు గడువు పొడగించినట్టు ఉమ్మడి జిల్లా కోఆర్డినేటర్ ప్రతాప్ సింగ్ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జూలై 7 వరకు గడువు ఉండగా జులై 12వ తేదీ వరకు పొడగించినట్లు పేర్కొన్నారు. మీసేవ, టీజీ, ఆన్‌లైన్ సెంటర్‌లోనే ఫీజు చెల్లించాలని పేర్కొన్నారు. పీజీ ద్వితీయ సంవత్సరం పరీక్షకు జూలై 31 నుంచి ఆగస్టు 4 వరకు, పీజీ మొదటి సంవత్సరం పరీక్షలు ఆగస్టు 9 నుంచి 13 వరకు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

బాలకార్మికుల నిర్మూలనేది...?

- రోడ్లపై తిరుగుతున్న చిన్నారులు
- బాలల పరిరక్షణ కమిటీలెక్కడ..?
- పట్టించుకోని అధికారులు... పనిలో బాలకార్మికులు



నవతెలంగాణ-ఆదిలాబాద్ రూరల్

బాల కార్మికులను పని పెట్టుకుంటే చర్యలు తప్పవు... బాలల హక్కులను పరిరక్షించాలని అధికారులు పదేపదే చెబుతుంటారు. కాని వస్తావిక రూపం దీనికి భిన్నంగా ఉంది. బాలల దినోత్సవం, ఇతర కార్యక్రమాల్లో తప్ప మిగిత సమయాల్లో వారి గురించి పట్టించుకునే వారే లేరని చెప్పడం ఎలాంటి సందేహం లేదు. బాలల హక్కుల కోసం ప్రత్యేకంగా బాలల పరిరక్షణ సమితి జిల్లాలో పని చేస్తుంది. అడపదడప దాడులు నిర్వహించి, బాల కార్మికులను నిర్మూలిస్తున్నామని, పనిలో పెట్టుకుంటే చర్యలు తప్పవని తూతూ మంత్రంగా హెచ్చరిస్తున్నారే తప్ప కఠినంగా వ్యవహరించడం లేదనే ఆరోపణలు లేకపోలేదు. నిత్యం కార్మిక శాఖ, బాలల పరిరక్షణ సమితి, సీడబ్ల్యూసీ, చైల్డ్‌లైన్ బాల కార్మికులను గుర్తించి వారిని బడిలో చేర్పించాలి. అదే విధంగా పోలీసులు కూడా బాల కార్మికుల వ్యవస్థ నిర్మూలన కోసం ఆపరేషన్ స్మైల్ కూడా చేపడుతున్నారు. ఆపరేషన్ ముస్కాన్‌ను ఎస్పీ ఆధ్వర్యంలో బాలల రక్షణ కోసం నిర్వహించారు. ఇందులో బాల కార్మికులను గుర్తిస్తున్నప్పటికి పూర్తి స్థాయిలో నిర్మూలించడంలో విఫలమవుతున్నారనే ఆరోపణలు ఉన్నాయి. బాలల హక్కులు, బాల కార్మికుల నిర్మూలన కోసం ఆయా శాఖలు ప్రత్యేకంగా ఉన్న పోలీసులు లేనిదే వారు కూడా ముందుకు సాగడం లేదని విమర్శలు వ్యక్తమవుతున్నారు.



రోడ్లపై తిరుగుతున్న చిన్నారులు..

కుటుంబ పరిస్థితుల నేపథ్యంలో పోషణలో చిన్నారులు రోడ్లపై తిరుగుతున్నారు. చెత్తచెదారాన్ని సేకరిస్తు దాన్ని విక్రయించి ఆదాయం పొందుతున్నారు. ఆదిలాబాద్ జిల్లా కేంద్రంతో పాటు ప్రతి మండలంలో ప్రస్తుతం బాలకార్మికులు కనిపిస్తున్నారు. జిల్లా కేంద్రంలో హోటళ్లు, రోడ్లపై వీరు తిరుగుతున్నారు. నిత్యం అధికారులు వారిని చూసి కూడా చూడనట్టు వ్యవహరిస్తున్నారు. బాలల ప్రత్యేక రోజుల్లోనే అధికారులు వీరి హక్కుల గురించి మాట్లాడి నిర్మూలించే విషయంలో నిర్లక్ష్యంగా ఉన్నారనే విమర్శలు వ్యక్తం అవుతున్నాయి.

బాలల పరిరక్షణ కమిటీలెక్కడ...?

బాలల హక్కులను పరిరక్షించడానికి ప్రభుత్వం బాలల పరిరక్షణ కమిటీలను ఏర్పాటు చేసింది. దీంతో పాటు చైల్డ్‌లైన్ కూడా పని చేస్తుంది. వీరు జిల్లా కేంద్రంలోనే ఉంటున్న ఇక్కడ గల్లీల్లో చెత్త ఎరుకుంటు తిరుగుతున్న బాల కార్మికులు కనిపించడం లేదా అని ప్రశ్నలు ప్రజల నుంచి వస్తున్నాయి. పర్యవేక్షించాల్సిన అధికారులే పట్టిపట్టనట్టు వ్యవహరిస్తున్నారని జనాలు అంటున్నారు. పట్టణంలో ఏ కాలనీలో చూసిన బాల కార్మికులు భుజాలకు గొనే సంచులు ధరించి చెత్త ఎరుకుంటు కనిపిస్తారు. ఈ విషయం అధికారులకు తెలిసిన కూడా ఎందుకు చర్యలు తీసుకోవడం లేదో అర్థం కానీ పరిస్థితి. రేపటి దేశ భవిష్యత్తు ఇలా రోడ్లపై తిరుగుతూ ఉంటే అధికారులు ఎం చేస్తున్నారు..? వారి నిర్లక్ష్యం కారణంగా ఆడుకుంటు చదువుకోవాల్సిన వయస్సులో కుటుంబ పోషణ కోసం రోడ్లపైకి రావాల్సిన దుస్థితి ఉంది. ప్రభుత్వాలు ప్రచారానికే చేసే ఆర్భాటం కన్న వారికి సరైన న్యాయం చేయాలని పలువురు కోరుతున్నారు.



బొగ్గు గనులను సింగరేణికే కేటాయించాలి

- సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ సభ్యులు అడివయ్య

నవతెలంగాణ-ఖానాపూర్



కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం బొగ్గు గనుల వేలం పాటను ఆపి సింగరేణికే కేటాయించాలని, సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ సభ్యులు ఎం. అడివయ్య అన్నారు. ఆదివారం ఖానాపూర్‌లో సీపీఐ(ఎం) నిర్మల్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన రాజకీయ శిక్షణ తరగతులకు ఆయన ముఖ్యఅతిథిగా హజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలోని సింగరేణి బొగ్గు బ్లాకును కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కార్పొరేట్ కంపెనీలకు కట్టబెట్టేందుకు కుట్ర పన్నుతోందని అన్నారు. శ్రావణపల్లిలో సింగరేణి సంస్థ బొగ్గు తవ్వి కేంద్ర ప్రభుత్వం వేలంపాట ద్వారా ప్రయివేట్ సంస్థలకు బొగ్గు గనులు తవ్వే అవకాశం కల్పించడం సరైంది కాదన్నారు. మన రాష్ట్రం నుంచి బొగ్గు గనుల శాఖ మంత్రిగా ఉన్న కిషన్‌రెడ్డి హైదరాబాద్ కేంద్రంగా వేలంపాటను ప్రారంభించడం హేయమైన చర్య అని అన్నారు. బొగ్గు గనులన్నీ ప్రయివేటు సంస్థలకు ఇచ్చిన తర్వాత సింగరేణికి ఇంకా ఏమి మిగులుతుందని అన్నారు. క్రమంగా సింగరేణి సంస్థను బలహీనపరిచి, నిర్వీర్యం చేసే ప్రయత్నం కేంద్రం చేస్తుందని అన్నారు. నగదీకరణ పేరుతో దేశంలో ఆరు లక్షల కోట్ల విలువైన ఆస్తులను కేంద్ర ప్రభుత్వం ప్రయివేటు సంస్థలకు కట్టబెట్టిందని అందులో భాగంగానే కోట్ల విలువైన గనులను ప్రయివేటు సంస్థలకు ఇవ్వాలని నిర్ణయాన్ని తీసుకుందని విమర్శించారు. గత పది సంవత్సరాలలో కేంద్ర ప్రభుత్వం దాదాపుగా 200 బొగ్గు బావులను ప్రయివేట్ సంస్థలకు కట్టబెట్టారని, ప్రభుత్వ రంగంలో గనులు లేకపోతే యువతకు ఉపాధి అవకాశాలు కనుమరుగవుతాయని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రం నుంచి 8 మంది బీజేపీ ఎంపీలు ఉండి కూడా బొగ్గు గనుల వేలాన్ని అడ్డుకోలేకపోవడం సిగ్గుచేటని విమర్శించారు. ప్రస్తుతం సింగరేణిలో 40 వేల మంది పర్మినెంట్ కార్మికులు ఉంటే మరో 30 నుంచి 35 వేల మంది కాంట్రాక్టు కార్మికులకు ఉపాధి కల్పిస్తున్నదని అన్నారు. రికార్డు స్థాయిలో అతి తక్కువ ధరకే నాణ్యమైన బొగ్గును ఉత్పత్తి చేస్తున్న ఘనత సింగరేణి సంస్థకే చెందుతుందని అన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు అనేక రూపాలలో ఆదాయాన్ని తీసుకొస్తున్న సింగరేణిని ప్రయివేటీకరణకు అప్పజెప్పి ప్రభుత్వం ఉపాధి అవకాశాలను కొల్లగొడుతున్నదని అన్నారు. కేంద్ర ప్రభుత్వ ధమననీతిని రాష్ట్ర ప్రజానీకం ఖండించాలని అన్నారు. బొగ్గు గనుల ప్రయివేటీకరణ వేగంగా జరిగితే, విద్యుత్తు ధర విపరీతంగా పెరుగుతుందని అన్నారు. సింగరేణికి చెందిన 22 బొగ్గు బావుల్లో బొగ్గు నిల్వలు అడుగంటి పోయాయని, కొత్త బ్లాకుల తవ్వకాలు ప్రారంభించాలి. కానీ కేంద్ర బీజేపీ ప్రభుత్వం ఇందుకు అనుమతించకుండా అడ్డుపడుతున్నదని విమర్శించారు. కేంద్ర ప్రభుత్వ నిర్ణయం వల్ల తెలంగాణ ప్రజానీకానికి తీవ్ర అన్యాయం జరుగుతుందన్నారు. శ్రావణపల్లి బ్లాకుతో పాటు మిగతా బ్లాక్‌లను కూడా తక్షణమే సింగరేణికి అప్పగించాలని, ఇందుకోసం రాష్ట్ర ప్రభుత్వము అఖిలపక్షాన్ని కలుపుకొని కేంద్రం మీద ఒత్తిడి చేయాలని డిమాండ్ చేశారు. అందుకు అనుగుణంగా రాష్ట్ర మంత్రివర్గం నిర్ణయం తీసుకొని శాసనసభ తీర్మానం చేయాలని లేని పక్షంలో ప్రజానీకాన్ని కలుపుకొని పెద్ద ఎత్తున ఉద్యమాలకు శ్రీకారం చూడుతామని హెచ్చరించారు. ప్రభుత్వం ఏర్పడి 6 నెలలు పూర్తి అయినప్పటికీ ఇంతవరకూ హామీని అమలు చేయలేదని అన్నారు. పైగా పేదలు వేసుకున్న గుడిసెలు తొలగించే కార్యక్రమం చేస్తున్నారని ఆరోపించారు. ఇది సరైన నిర్ణయం కాదని అలాంటి నిర్ణయాలను వెంటనే విడనాడాలని అన్నారు. ఇందిరమ్మ ఇంటి పథకాన్ని వీరికి అమలు చేసి, రాష్ట్ర ప్రభుత్వం రూ.5 లక్షలు, కేంద్ర ప్రభుత్వం రూ.10 లక్షలు ఇంటి నిర్మాణానికి ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి గౌతమ్ కృష్ణ, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు దుర్గం నూతన్ కుమార్, బొమ్మెన సురేష్, పార్టీ జిల్లా కమిటీ సభ్యులు తొడసం శంభు, ఇప్ప లక్ష్మణ్, గంగామణి, పార్టీ ఖానాపూర్ మండల కార్యదర్శి నాగెల్లి నర్సయ్య, జిల్లా నాయకులు ఫసియోద్దీన్ పాల్గొన్నారు.

ఆదర్శం ఆ గ్రామం

- మద్యపానాన్ని నిషేదిస్తు తీర్మాణం
- హర్షం వ్యక్తం చేస్తున్న చుట్టు పక్కల గ్రామాలు

నవతెలంగాణ-ఆదిలాబాద్ రూరల్

మద్యపానం వల్ల ఆరోగ్యంతో పాటు కుటుంబాలు విచ్ఛిన్నం కావడం .. ముఖ్యంగా బడికి వెళ్లే వయస్సులోనే చిన్నారులు మద్యానికి అలవాటు పడి దురలవాట్లకు బానిసలవడం ఆ గ్రామస్తులను కలిచివేసింది. ఎన్నో అనార్థలకు కారణమవుతున్న మద్యపానాన్ని తమ గ్రామంలో నిషేదాన్ని అమలుచేస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారు ఆదిలాబాద్ రూరల్ మండలం అంకోలి గ్రామస్తులు.



గ్రామంలోని బెల్టుషాపు, తెల్లకల్లు దుకాణాల్లో మద్యం విక్రయాలతో యువత, చిన్నారులతో పాటు వ్యవసాయ పనులకు వెళ్లే వారు సయితం మద్యానికి అలవాటుపడి భవిశ్యత్తును నాశనం చేసుకోవడంతో ఈ అనర్థాన్ని గుర్తించిన గ్రామస్తులు, వారి కుటుంబీకులు గ్రామంలో మద్యపానాన్ని నిషేదించారు. రెండు నెలల క్రితం గ్రామస్తులంతా సమావేశమై తిమేరకు నిర్ణయం తీసుకోవమే కాక కఠినంగా అమలుచేస్తున్నారు. గ్రామంలో అక్రమ మద్యం, తెల్లకల్లు విక్రయాలు జరగకుండా తమకు తాముగానే కఠిన నిర్ణయాలు చేసుకొని వాటిని అమలుచేసేలా తీర్మానించారు. మద్యపానాన్ని నిషేదిస్తూ గ్రామస్తులు సమిష్టిగా తీసుకున్న నిర్ణయాన్ని పలువురు హర్షిస్తున్నారు. ఇదే సమయంలో యువత ఆధ్యాత్మిక మార్గంవైపు పయనించేలా ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించేలా ప్రణాళికలు చేశారు. అంకోలి గ్రామస్తుల ఆలోచనను ఇతర గ్రామాల వారు హర్షం వ్యక్తం చేస్తున్నారు. వారి గ్రామాల్లో కూడా మద్యపానాన్ని నిషేదించుందకు చర్చించుకుంటున్నట్లు తెలిసింది. ఇదే అయితే మండలంలో మద్యపానం పూర్తిగా నిషేదం అయి గ్రామాలు అభివృద్ధివైపు పయనించే అవకాశాలున్నాయి.

మద్యంతో జీవితాలు అంధకారం

చాకటి సోంజీ, మాజీ సర్పంచ్



గ్రామంలో యువతతో పాటు చిన్నారులు మద్యానికి అలవాటుపడి జీవితాలను అంధకారం చేయడం తమను కలిచివేసింది. దీంతో ఈ కఠిన నిర్ణయాన్ని అమలుచేశాం. మద్యపాన నిషేదంతో తమ గ్రామం కొంత ఆదాయం కోల్పోయినా యువత, చిన్నారుల భవిశ్యత్తే తాము ముఖ్యభావించాం. గ్రామస్తులెవరైనా మద్యం సేవిస్తే చర్యలకు వెనుకాడబోం.

ఏకతాటిపైకి వచ్చి తీర్మాణం


ఎర్రం నర్సింగ్ రావ్, యువజన సంఘాల సమితి అధ్యక్షుడు



యువత చేతుల్లోనే దేశ, గ్రామ భవిష్యత్తు ఆధారపడి ఉంది. అలాంటి యువత చెడు వ్యసనాలకు అలవాటు పడటం గ్రామస్తులను ఆలోచింపజేసింది. ఆ మేరకు గ్రామస్తులంతా ఏకతాటిపైకి వచ్చి మద్యాన్ని నిషేదిస్తు తీర్మానించారు. ఇదే సమయంలో యువతను ఆధ్యాత్మిక మార్గంతో పాటు పై చదువుల వైపు మళ్లించేలా కార్యక్రమాలను రూపొందిస్తున్నాం. గ్రామంలో మద్య పానం నిషేధం అమలుపై జిల్లా కలెక్టర్, ఎస్పీలకు వినతిపత్రాలు అందించాం.

గ్రామ అభివృద్ధి కుంటుపడుతోంది

తండ్రా మల్లేష్, అంకోలి



యువత తాగుడుకు బానిసలు అవడంతో వారి భవిశ్యత్తుతో పాటు గ్రామం అభివద్ధిలో కుంటుపడుతోంది. దీన్ని గుర్తించి అంతా కలిసి సమిష్టి నిర్ణయం తీసుకున్నాం. మద్యానికి అలవాటు పడి పనులు మాని యువత, బాలలు, డిన్నర్లు, పార్టీలు అంటు చెడు వ్యసనాలకు అలవాటుపడుతున్నారు. యువతతో పాటు గ్రామాన్ని కాపాడానికి ఈ నిషేదం విధించాం.

ఉపాధ్యాయులకు సన్మానం



నవతెలంగాణ-ఆదిలాబాద్ రూరల్

మావల మండల కేంద్రంలో ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో సుదీర్ఘకాలంగా పనిచేసిన ఉపాధ్యాయులు ఇటీవల బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు రామగిరి కుమార్, కుశాల్ జాడేలను గ్రామస్తులు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మాజీ మంత్రి జోగు రామన్న పాల్గొని గ్రామస్తులతో కలిసి శాలువాతో కప్పి ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా బదిలీ అయిన ఉపాధ్యాయులు గ్రామస్తుల ఆప్యాయత పట్ల భావోద్వాగానికి గురయ్యారు. గ్రామస్తుల ఆప్యాయత జీవితంలో ఎన్నటికీ మర్చిపోలేని కొనియాడారు. ఈ కార్యక్రమంలో మాజీ మార్కెట్ కమిటీ చైర్మెన్ ప్రహ్లాద్, యాసం నర్సింగ్‌రావు, యూనిస్ అక్బాని, మాజీ జెడ్పీటీసీ వనితా నల్ల రాజేశ్వర్, మాజీ ఎంపీటీసీ ఉమాకాంత్‌రెడ్డి, గ్రామ పెద్దలు ప్రధానోపాధ్యాయులు అట్ల విద్యాసాగర్, సేవ్వ జగదీష్, భోజన్న, గోవర్ధన్ పాల్గొన్నారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
ఆదిలాబాద్-నిర్మల్
సోమవారం | జులై 08, 2024 | www.navatelangana.com

పల్లిల చోరీ కేసులో మరొకరు అరెస్ట్

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్



పట్టణంలోని శ్రీనాథ్ జిన్నింగ్ మిల్లులో గత నెలలో జరిగిన పల్లీల బస్తాల, వైర్‌ల చోరీ కేసులో మరొక దొంగను అరెస్ట్ చేసినట్లు టూ టౌన్ సీఐ కరుణాకర్‌రావ్ తెలిపారు. ఆదివారం స్టేషన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో కేసు వివరాలు వెల్లడించారు. ఈ చోరీ కేసులో ఇటీవల ముగ్గురిని అరెస్ట్ అయ్యారని పేర్కొన్నారు. సుందరయ్య నగర్ కాలనీకి చెందిన తబ్రేజ్ పరారీలో ఉండగా తాజాగా ఐడి పార్టీ పోలీసులు పట్టుకున్నట్లు పేర్కొన్నారు. అతని వద్ద నుండి రెండున్నర క్వింటాళ్ల పల్లిలు, ఎల్టీ వైర్ స్వాధీనం చేసుకున్నామని స్పష్టం చేశారు. ఈ కేసులో మరొకరు పరరీలో ఉన్నారు. అతన్ని కూడా త్వరలో పట్టుకుంటామన్నారు. సమావేశంలో పోలీసులు రమేష్, నరేష్, క్రాంతి, నరేందర్ ఉన్నారు.

ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో పండ్లు పంపిణీ

నవతెలంగాణ-ఖానాపూర్‌టౌన్



మంద కృష్ణ మాదిగ జన్మదినం సందర్భంగా ఆదివారం స్థానిక ప్రభుత్వ దవాఖానాలో ఎమ్మార్పీఎస్ నాయకులు రోగులకు పండ్లు పంపిణీ చేశారు. మొదట అంబేద్కర్ నగర్‌లో జెండా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎంఎస్ఎఫ్ జాతీయ కార్యదర్శి బిక్కి కృష్ణ మాట్లాడారు. మాదిగల హక్కుల కోసం తమ నాయకుడు మంద కృష 30 ఏండ్లుగా విరామం లేకుండా ఉద్యమం చేయడాన్ని కొనియాడారు. సబ్బండ వర్గాలకు ఎక్కడ అన్యాయం జరిగినా ఎమ్మార్పీఎస్ మందుండి పోరాటం చేస్తుందన్నారు. త్వరలోనే మంద కృష్ణ మాదిగ అధ్వర్యంలో షెడ్యూల్డ్ కులాల వర్గీకరణ సాదించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు కుంటాల రాజన్న, హరీశ్, జన్నారపు శంకర్, శెట్పెల్లి మోహన్, ప్రవీణ్, నరేందర్, శంకర్, దేవేందర్, నాగరాజు, మనోజ్, వంశీ, అశోక్ పాల్గొన్నారు.

మండలాభివృద్ధికి కృషి

- డీసీసీబీ చైర్మెన్ అడ్డి బోజారెడ్డి



నవతెలంగాణ-తలమడుగు

జెడ్పీటీసీగా మండలాభివృద్ధికి గోక గణేష్‌రెడ్డి ఎంతో కృషి చేశారని డీసీసీబీ చైర్మెన్ అడ్డి బోజారెడ్డి అన్నారు. ఆదివారం మండలంలోని రుయ్యాడి గ్రామంలోని హస్నేస్‌హస్నేన్ పంక్షన్ హాల్లో ఏర్పాటు చేసిన సన్మాన కార్యక్రమంలో జెడ్పీటీసీ, ఎంపీటీసీలు పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి డీసీసీబీ అడ్డి బొజారెడ్డి ముఖ్యఅతిథిగా హజరై మాట్లాడారు. పార్టీలకు అతీతంగా అభివృద్ధే ధ్యేయంగా పనిచేశాడని తెలిపారు. బోథ్ నియోజవర్గ ఇన్‌చార్జీ ఆడే గజేంద్ర మాట్లాడుతూ జెడ్పీటీసీగా ఐదు సంవత్సరాలు పేద ప్రజలకు అండగా ఉంటూ అన్ని రంగాల్లో అభివృద్ధి చేశారని అన్నారు. మాజీ జెడ్పీటీసీ గోక గణేష్‌రెడ్డి మాట్లాడుతూ పదవి ఉన్నా లేకున్నా ప్రజల కోసం ఎల్లవేళలా అండగా ఉంటానని అన్నారు. పదవీ కాలం పూర్తయినప్పటికీ మండల ప్రజలకు సేవ చేస్తూనే ఉంటానని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీలు, సర్పంచులకు శాలువాతో సన్మానించారు. ఆత్మీయ వీడ్కోలు కార్యక్రమంలో మాజీ ఎంపీపీ కళ్యాణం లక్ష్మి రాజేశ్వర్, ఎంపీటీసీలు, సర్పంచులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఎస్సీల వర్గీకరణను సాధిస్తాం



నవతెలంగాణ-నార్నూర్

ఎస్సీల వర్గీకరణను సాధిస్తామని అన్నాబావు సాతే మండలాధ్యక్షులు, మాదిగ హక్కుల దండోరా రాష్ట్ర నాయకులు కే మహేందర్ అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో అమరవీరుల సంస్మరణ దినోత్సవం సందర్భంగా అమరుల చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత మూడు దశాబ్దాలుగా మాదిగలకు వర్గీకరణ ద్వారా దక్కాల్సిన న్యాయమైన వాటా కోసం జరుగుతున్న పోరాటంలో మాదిగ జాతి ప్రయోజనాల కోసం అసువులు బాసిన మాదిగ అమరవీరుల సాక్షిగా ఎస్సీల వర్గీకరణ సాధిస్తామన్నారు. రేపటి తరాలకు అభివృద్ధి ఫలాలు అందాలంటే వర్గీకరణ ఒక్కటే మార్గమని అన్నారు. ఎన్నికల ముందు నరేంద్ర మోడీ మాదిగలకు ఇచ్చిన హామీ ప్రకారం రాబోయే పార్లమెంట్ బడ్జెట్ సమావేశాల్లో వర్గీకరణ బిల్లును ప్రవేశపెట్టి చిత్తశుద్ధిని నిరూపించుకోవాలన్నారు. కార్యక్రమంలో యువజన నాయకులు జిల్లాపెల్లి సుకుమార్, కాంబ్లే సాయి, జిల్లాపెల్లి ప్రకాష్, మోరే మహేందర్ పాల్గొన్నారు.

పోచమ్మ ఆలయాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే



నవతెలంగాణ-వాంకిడి

మండలంలోని అర్జుగూడలో నూతనంగా నిర్మించిన పోచమ్మ ఆలయాన్ని ఆదివారం ఎమ్మెల్యే కోవ లక్ష్మి ప్రారంభించారు. గతంలో డీఈఎంఎస్‌టీ నిధుల నుండి రూ.10 లక్షల వ్యయంతో నిర్మించిన ఈ ఆలయాన్ని నూతనంగా ప్రతిష్టించిన పోచమ్మ దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మండలంలో బీఆర్ఎస్ ప్రభుత్వం అన్ని వర్గాలకు అభివృద్ధి చేయడం జరిగిందని, నూతనంగా నిర్మించిన ఆలయానికి వచ్చి ప్రత్యేక పూజలు నిర్వహించి అందరూ సుఖసంతోషాలతో ఉండాలన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ సీనియర్ నాయకురాలు మర్సుకోల సరస్వతి, మాజీ జడ్పీటీసీ అజయ్ కుమార్, సింగిల్ విండో చైర్మన్ పెంటు, మాజీ సర్పంచ్ తుకారాం, భక్తులు, వ్యాపారస్తులున్నారు.

నిజాయితీ చాటుకున్న టైగర్ గ్రూప్ సభ్యులు

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

పోగొట్టుకున్న మొబైల్‌ను తిరిగి అప్పగించి ఓ యువకుడు తన నిజాయితీని చాటుకున్నాడు. జిల్లా కేంద్రంలోని సినిమా రోడ్డులో అంబేద్కర్ నగర్ కాలానికి చెందిన రాహిల్ అనే వ్యక్తి ఆదివారం మధ్యాహ్నం తన రూ.85 వేల విలువగల యాపిల్ మొబైల్ పోగొట్టుకున్నాడు. అటుగా వెళ్తున్న టైగర్ గ్రూపుకు చెందిన అజయ్‌కి ఆ ఫోన్ దొరకగా మావల పోలీస్ స్టేషన్‌లో అప్పగించారు. టైగర్ గ్రూప్ అధ్యక్షుడు గోపాల్ జాధవ్ ఆధ్వర్యంలో పోలీసులు ఆ మొబైల్‌ను రాహిల్‌కు అప్పగించగా ఆయన కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో టైగర్ గ్రూప్ సభ్యులు శశి, కిరణ్, ఆకాష్, కుమార్, ఫిరోజ్ పాల్గొన్నారు.



గొండిభాష అభివృద్ధికి కృషి చేస్తాం

- కలెక్టర్ రాజర్షిషా



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

గొండిభాష అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానని కలెక్టర్ రాజర్షిషా అన్నారు. ఆదివారం తొడసం కైలాస్ గొండి భాషలో రచించిన పండోక్న మహాభారత్ కథ పుస్తకావిష్కరణ కార్యక్రమాన్ని ఆదివారం జెడ్పీ సమావేశ మందిరంలో నిర్వహించారు. దీనికి కలెక్టర్ ముఖ్యఅతిథిగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆదివాసీ కళాకారిణి మర్సుకోల కళవతి మహాభారతంలో పాండవుల జననం గురించి గోండి భాషలో పాట రూపంలో తెలియజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ రాజర్షిషా మాట్లాడుతూ భాషపై అభిమానంతో తొడసం కైలాస్ మహాభారతం గోండులకు తెలియజేలాని గోండి భాషలో రచించడం అభినందనీయమన్నారు. భాష అభివృద్ధికి ఆర్థిక సాయం కావాలని నాయకులు, రచయిత కైలాస్ కోరారని అన్నారు. ఈ విషయన్నీ ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి తన వంతు సహకారం అందిస్తానన్నారు. అదే విధంగా పునాది విద్య గట్టిగా ఉండాలంటే మాతృభాషలోనే బోధనలు జరాగాల్సిన అవసరం ఉందన్నారు. దానికోసం ప్రయాత్నాలు చేస్తున్నామని పేర్కొన్నారు. ఇప్పటికే అంగన్‌వాడీ కేంద్రాల్లో తెలుగులో ఉన్న కూడా టీచర్లు గోండి భాషలోనే బోధనలు చేస్తున్నారని తెలిపారు. ఏజెన్సీ ప్రాంతాల్లో గర్భిణులు అధికంగా రక్తహీనతతో బాదపడుతున్నారని దీనిపై అవగాహన కల్పించి, పౌష్టికాహారం తీసుకునేలా ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే ఆత్రం సక్కు, కాంగ్రెస్ నాయకులు ఆత్రం సుగుణ, మహిళ కమిషన్ సభ్యురాలు ఈశ్వరీ బాయి, రచయిత మేస్రం మనోహర్, తొడసం చందు, గొండి, కొలాం, తోటి తెగల నాయకులు పాల్గొన్నారు.

ప్రజల హృదయాల్లో చెరగని ముద్ర

- మాజీ మంత్రి రామచంద్రారెడ్డి ప్రథమ వర్ధంతి



నవతెలంగాణ-ఆదిలాబాద్‌రూరల్

మాజీ మంత్రి సి.రామచంద్రారెడ్డి భౌతికంగా దూరమైనా ప్రజల హృదయాల్లో చెరగని ముద్ర వేశారని మాజీ మంత్రి జోగు రామన్న, కాంగ్రెస్ ఆదిలాబాద్ పార్లమెంట్ ఇన్‌చార్జీ ఆత్రం సుగుణ అన్నారు. మావల మండల కేంద్రంలోని చిల్కూరి లక్ష్మి గార్డెన్‌లో మాజీ మంత్రి సి.రామచంద్రారెడ్డి మొదటి వర్ధంతి వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా రామచంద్రారెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. దివంగత రామచంద్రారెడ్డి ఆదిలాబాద్ అభివృద్ధికి ఎనలేని కృషి చేశారు. ఆయనను ఆదర్శంగా తీసుకొని అడుగు జాడల్లో నడువాలని అన్నారు. ప్రజల కష్ట సుఖాలను తెలుసుకుని, ఆప్యాయంగా పలకరించే ఆయన మన మధ్య లేకపోవడం దురదృష్టకరమని తెలిపారు. ఘనంగా నివాళులర్పించిన వారిలో మాజీ మంత్రి రామచంద్రారెడ్డి సతీమణి చిల్కూరి గంగమ్మ, ఎమ్మెల్యే పాయల్ శంకర్, గండ్రత్ సుజాత, అల్లూరి సంజీవరెడ్డి, నరేష్ జాదవ్, చిల్కూరి లక్ష్మారెడ్డి, సీపీఐ జిల్లా కార్యదర్శి ముడుపు ప్రభాకర్ రెడ్డి, నళినిరెడ్డి, సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి దర్శనాల మల్లేష్, సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు లంక రాఘవులు, బండి దత్తాత్రి, తెలంగాణ కిసాన్ కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బోరంచు శ్రీకాంత్‌రెడ్డి, సాజిద్‌ఖాన్, ఆయా పార్టీల రాజకీయ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

కరాటే విద్యార్థులకు కలర్ బెల్ట్ పరీక్షలు

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

పట్టణంలోని అంబెద్కర్ భవనంలో బోధి బుడోకాన్ కరాటే అసోసియేషన్ ఆధ్వర్యంలో కరాటే విద్యార్థులకు కలర్ బెల్ట్ పరీక్షలు నిర్వహించారు. ఆదివారం అసోసియేషన్ సీనియర్ మాస్టర్ కాంబ్లె ముకేష్ కుమార్ ఆధ్వర్యంలో 126 మంది కరాటే విద్యార్థులకు పరీక్షలు నిర్వహించి బెల్టులను అందించారు. ఇందులో 38 మంది ఎల్లో బెల్టు, 21 మంది ఆరెంజ్, 18 మంది గ్రీన్, 14 మంది బ్లూ, 12 మంది పర్పుల్, 23 మంది బ్రౌన్ బెల్టులు సాధించినట్లు తెలిపారు. పరీక్షలో సీనియర్ మాస్టర్లు ఆకాష్, పవార్ సంధ్య, సునీతా, అనుష్క, అంగీరస్ బౌద్ధ, బుధగాయ అభిజిత్, స్వస్తిక, శఫాన్ అంజూమ్‌లున్నారు.

ఎంపీ, ఎమ్మెల్యేకు వీఆర్‌ఓల వినతి



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

వీఆర్ఓ జిల్లా కమిటీ ఆధ్వర్యంలోఎంపీ గోడం నగేష్, ఎమ్మెల్యే పాయల్ శంకర్‌ను సభ్యులు ఆదివారం కలిశారు. వీఆర్ఓల సమస్యల పరిష్కారం కోసం వినతిపత్రం అందజేసి ప్రభుత్వం దృష్టికి తమ సమస్యలను తీసుకెళ్లాలని కోరారు. దీనికి వారు స్పందిస్తూ వీఆర్ఓ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి కృషి చేస్తామని హామీ ఇచ్చినట్లు తెలిపారు. వారిని కలిసిన వారిలో జిల్లా అధ్యక్షులు వెంకటి, జిల్లా ఉపాధ్యక్షులు వామన్ రావు, శ్రీధర్, రాష్ట్ర కమిటీ సభ్యురాలు అనసూయ, అహల్య, అరుణ్, నారాయణ, హనీష్, దేవరావు, వినాయక్, పురుషోత్తం శివమూర్తి, షఫీ ఉన్నారు.

మొదలైన గోరింటాకు సంబరాలు

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఆషాఢ మాసం ప్రారంభం కావడంతో జిల్లాలోని ఆలయాల్లో గోరింటాకు సంబరాలు మొదలయ్యాయి. ఆదివారం జిల్లా కేంద్రంలోని కన్యకా పరమేశ్వరి మందిరంలో ఆర్య వైశ్య వాసవీ మహిళా మండలి ఆధ్వర్యంలో మహిళలు తమ చేతులకు గోరింటాకు పెట్టుకుని సందడి చేశారు. ఈ నెల రోజుల పాటు తమకు పండగేనని, ఆరోగ్యాన్ని పెంపొందించే గోరింటాకు పెట్టుకునే ఈ సంస్కృతి, సంప్రదాయాలను కొనసాగిస్తున్నామని పేర్కొన్నారు. అంతకు ముందు గౌరీదేవికి ప్రత్యేక పూజలు నిర్వహించిన మహిళలు పాటలు పాడుతూ గోరింటాకును ఒకరికొకరు చేతులకు అలంకరించుకున్నారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య వాసవీ మహిళా మండలి వ్యవస్థాపకురాలు సరిత ఉప్పలంచివార్, గౌరవ అధ్యక్షురాలు రాగిణి ఉపలంచివార్, అధ్యక్షురాలు ప్రియాంక మహాజన్, ప్రధాన కార్యదర్శి సుస్మిత పడిగేలవార్, కోశాధికారి అశ్విని గాదేవార్, ఉపాధ్యక్షురాలు పారిజాత పోల, సభ్యులు అమూల్య, శ్రీజ, కవిత, పావని, రమ, సవిత, శ్రీవాణి పాల్గొన్నారు.

ఓవరాల్ ఛాంపియన్‌గా జిల్లా జట్టు

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

రామోజీరావు జ్ఞాపకార్థం హైదరాబాద్‌లో ఆదివారం నిర్వహించిన రెండవ తెలంగాణ స్టేట్ కిడ్స్ అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్ పోటీలలో జిల్లా క్రీడాకారులు ఉత్తమ ప్రదర్శన కనబరిచారు. ఈ పోటీలలో ఓవరాల్ ఛాంపియన్‌గా జిల్లా జట్టు ఎంపికైనట్లు జిల్లా అథ్లెటిక్స్ సెక్రటరీ రాజేష్ తెలిపారు. ఉత్తమ ప్రదర్శన కనబరిచిన క్రీడాకారులను పలువురు అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో కోచ్లు విజిఎస్ రాకేష్, రాహుల్, సునంద ఉన్నారు.

రెండో రోజు 231 మందికి వేరిఫికేషన్ పూర్తి




నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ప్రభుత్వ, ప్రయివేట్ ఇంజినీరింగ్ కళాశాలల్లో బీటెక్‌లో ప్రవేశానికి ఎప్‌సెట్ తొలి విడత కౌన్సెలింగ్ ప్రక్రియలో భాగంగా రెండో రోజు ప్రశాంతంగా జరిగింది. పట్టణంలో ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ఏర్పాటు చేసిన హెల్ప్ లైన్ సెంటర్‌లో ఆదివారం రెండో రోజు ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు సర్టిఫికెట్ వేరిఫికేషన్ ప్రక్రియ కొనసాగింది. అభ్యర్థులు స్లాట్ బుక్ చేసుకున్న విధంగా హాజరై తమ ధ్రువపత్రాలను ధ్రువీకరణ చేసుకున్నారు. ఈ ప్రక్రియను కోఆర్డినేటర్ వీరస్వామి పర్యవేక్షించారు. అభ్యర్థులకు ఉన్న సందేహాలను నివృత్తి చేశారు. కాగా రెండో రోజు 280 మంది అభ్యర్థులు స్లాట్ బుక్ చేసుకోగా 231మంది అభ్యర్థులు హాజరై తమ సర్టిఫికెట్ వేరిఫికేషన్ పూర్తి చేసుకున్నారని కోఆర్డినేటర్ వీరస్వామి తెలిపారు. నేడు సోమవారం చివరి రోజు కౌన్సెలింగ్ ప్రక్రియ ఉంటుందని తెలిపారు. సర్టిఫికెట్ వేరిఫికేషన్ పూర్తయిన అభ్యర్థులు నచ్చిన కళాశాలలు, కోర్సులను ఎంచుకునేందుకు వెబ్‌ఆప్షన్లు ఇచ్చుకోవాలని అన్నారు. వారికి జులై 19న తొలివిడత సీట్ల కేటాయింపు పూర్తి చేయనున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో చీఫ్ వెరిఫికేషన్ ఆఫీసర్ రాజన్న, సిస్టం అనలిస్ట్ సుజయ్, అధ్యాపకులు నర్సయ్య, శ్రీనివాస్, ప్రవీణ్, సురేష్, హేమలత, సుధాకర్, సంజయ్ సింగ్, సంతోష్, శ్రీనివాస్ ఎజాజ్ పాల్గొన్నారు.

కార్యకర్తకు పరామర్శ

నవతెలంగాణ-ఆదిలాబాద్ రూరల్



ఆదిలాబాద్ మండలంలోని తంతోలి గ్రామానికి చెందిన ఫిరంగి మల్లేష్ బీఆర్ఎస్ సీనియర్ కార్యకర్త ఇటీవల బైక్ ప్రమాదంలో స్వల్ప గాయాలకు గురయ్యారు. ఇంటి వద్ద విశ్రాంతి ఉండగా విషయం తెలుసుకున్న మాజీ మంత్రి జోగు రామన్న ఆదివారం వారి స్వగ్రామానికి చేరుకొని పరామర్శించారు. ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. మాజీ మార్కెట్ చైర్మెన్ మెట్టు ప్రహ్లాద్, యాసం నర్సింగరావు, మాజీ ఎంపీపీ సెవ్వ జగదీష్, సతీష్, శ్రీనివాస్, కుమ్ర రాజు ఉన్నారు.

దశల వారీగా ఉద్యమాలు చేపడుతాం

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి దశల వారీగా ఉద్యమాలు చేపడతామని సీపీఐ జిల్లా కార్యదర్శి ముడుపు ప్రభాకర్ రెడ్డి అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ మిత్ర పక్షమైన కాంగ్రెస్ పార్టీతో కలిసి పనిచేస్తామని, అధికారులకు వినతిపత్రాలు సమర్పిస్తామని పేర్కొన్నారు. కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం ఉండటంతో ఉపాధి హామీ డబ్బులు చెల్లించడంలో తీవ్రంగా జాప్యం అవుతుందని వాపోయారు. జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ ఎదుట సోమవారం ధర్నా నిర్వహిస్తున్నట్టు వివరించారు. ఈ సమావేశంలో సీపీఐ నాయకులు కట్కోజి, కుంటాల రాములు, అరుణ్ కుమార్, బెజ్జంకి నర్సింగ్ రావు పాల్గొన్నారు.

ఆదివాసీ గ్రామాల్లో ఘనంగా అకాడి పండగ పూజలు

- వన దేవతలకు మొక్కులు తీర్చుకున్న ఆదివాసులు



నవతెలంగాణ-నార్నూర్

మండలంలోని ఏంపల్లి, గోండుగూడ, గ్రామ సమీపంలోని అటవీ ప్రాంతంలో ఆదివారం ఆదివాసులు వన దేవతలకు ప్రత్యేక పూజలు చేసి అకాడి పండుగను జరుపుకున్నారు. పంటలు బాగా పండాలని తమ పశువులను అడవి జంతువుల నుంచి రక్షణ కల్పించాలని, కోళ్ళ, మేకలతో మొక్కులు తీర్చుకున్నారు. పంటలు బాగా పండాలని పశువులను కాపాడాలని వేడుకున్నారు. అనంతరం సహపంక్తి బోజనాలు చేశారు. ప్రతి ఏటా ఆషాఢ మాసంలో ఈ ఆకాడి పండుగ నిర్వహించడం అనవాయితీగా వస్తుందని, ఆదివాసీ గ్రామ పెద్దలు తెలిపారు. కార్యక్రమంలో గ్రామ పటేల్ పెందోర్ అమృత్‌రావ్, పెందోర్ రాము, పెందోర్ ఆనంద్‌రావ్, పూసం జాంబిరావ్, కొట్నాక్ భీంరావ్, మాడవి జల్పత్, పెందోర్ జగన్నాథ్, కొట్నాక్ దేవిదాస్ గ్రామస్తులు పాల్గొన్నారు.

హక్కుల సాధనకు ఎమ్మార్పీఎస్ రాజీలేని పోరాటం

- ఘనంగా ఆవిర్భావ వేడుకలు



నవతెలంగాణ-ఆదిలాబాద్ టౌన్

మాదిగల అభ్యున్నతితో పాటు రిజర్వేషన్ల సాధన కోసం 30 ఏండ్ల కింద 18 మందితో ప్రకాశం జిల్లా ఈదుమూడిలో ఎమ్మార్పీఎస్ ఆవిర్భావించిందని, అప్పటి నుంచి అనేక పోరాటలు చేస్తు హక్కుల సాధన దిశగా సాగుతోందని ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు ఆరెల్లి మల్లేష్ అన్నారు. ఆదివారం ఎమ్మార్పీఎస్ 30వ ఆవిర్భావ దినోత్సవంతో పాటు వ్యవస్థాపకులు మంద కృష్ణ మాదిగ జన్మదిన వేడుకలను నిర్వహించారు. ముందుగా సంఘం జెండాను ఆవిష్కరించారు. అనంతరం కేక్ కట్ చేసి మంద కృష్ణ మాదిగకు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు ఆరెల్లి మల్లేష్ మాట్లాడుతూ ఎస్సీ రిజర్వేషన్ కోసం బలంగా పోరాటం చేస్తునే బాధ్యతగల సంఘంగా ఇతర సమస్యలపై కూడా ఉద్యమిస్తున్నామన్నారు. ఆరోగ్య శ్రీ పథకం, వృద్ధులు, వితంతవులు, వికాలంగులకు పెన్షన్‌తో పాటు పిడిత వర్గాల కోసం పోరాటం చేశామన్నారు. అన్ని వర్గాలను చైతన్య పరిచి హక్కుల సాధన దిశగా సాగామని గుర్తు చేశారు. ఎస్సీ వర్గీకరణయే ధ్యేయంగా ఎమ్మార్పీఎస్ రాజీలేనిపోరాటం చేస్తుందని స్పష్టం చేశారు. ప్రభుత్వం ఇప్పటికైన స్పందించి ఏబీసీడీ వర్గీకరణ చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు సురేష్, మనోజ్, గణేష్, శంకర్, గంగయ్య, రాములు, విద్యాసాగర్, ఎల్లన్న, రవి, ఇస్తారి పాల్గొన్నారు.

బుగ్గారంలో ఉచిత వైద్య శిబిరం



నవతెలంగాణ-నేరడిగొండ

ప్రభుత్వ ఉపాధ్యాయుడు ఆడే సకారాం స్మారకార్థం నేరడిగొండ మండలంలోని బుగ్గారం గ్రామంలో ఆదివారం ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ శిబిరంలో ఆదిలాబాద్ జిల్లా కేంద్రానికి చెందిన శ్రీకృష్ణ ఆస్పత్రి వైద్యులు డాక్టర్ క్రాంతి కుమార్, డాక్టర్ రాథోడ్ కావ్య, డాక్టర్ రాహుల్, డాక్టర్ గణేష్ పాల్గొని సుమారు 200 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి, పలు సూచనలు చేసి మందులు అందజేశారు. వర్షాకాలం నేపథ్యంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. అనంతరం గ్రామస్తులు వారిని శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో ఆస్పత్రి మేనేజర్ విజయ్, ప్రశాంత్ సిబ్బంది ఉన్నారు.

బాధితుడికి పరామర్శ

నవతెలంగాణ-సారంగాపూర్

ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతున్న ఆలూరు గ్రామానికి చెందిన రజక సంఘం మండలాధ్యక్షులు చందాల సాయినాథ్‌ను ఆదివారం మాజీ మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి పరామర్శించి, ప్రమాదానికి గల కారణాలను అడిగి తెలుసుకొని అధ్యైర్య పడద్దు, అండగా ఉంటానని తెలిపారు. సాయినాథ్‌కు మెరుగైన వైద్యం అందించాలని అక్కడ ఉన్న డాక్టర్‌కు సూచించారు. వీరి వెంట అడెల్లి పోచమ్మ ఆలయ మాజీ చైర్మెన్ ఐయిటి చందు ఉన్నారు.



ఉరేసుకొని యువకుడు ఆత్మహత్య

నవతెలంగాణ-సిర్పూర్(టి)



మండల కేంద్రంలో మతిస్థిమితం లేక మాల్యాం శివం కుమార్(32) ఇంట్లో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై దీకొండ రమేష్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. మంచిర్యాల జిల్లా లక్షెట్టిపేట మండలం తిమ్మాపూర్ గ్రామానికి చెందిన మాల్యాం లక్ష్మీకాంత సిర్పూర్(టి) అటవీశాఖ కార్యాలయంలో అటెండర్‌గా విధులు నిర్వహిస్తుంది. ఈమెకు ముగ్గురు కూతుళ్ల ఇద్దరు కొడుకులున్నారు. మృతి చెందిన కొడుకు చిన్నవాడు. ఈయనకు ఆరు సంవత్సరాల నుండి మతిస్థిమితం సరిగా లేక అప్పుడప్పుడు పిచ్చిపిచ్చిగా ప్రవర్తిస్తుండేవాడు. చికిత్సకు కరీంనగర్, చంద్రపూర్ హాస్పిటల్లో చూపించిన ఆరోగ్యం మెరుగుపడలేదు. మనస్థాపానికి గురై ఆదివారం ఉదయం తల్లి, అక్క ఇంట్లో సరుకుల కోసం దుకాణానికి వెళ్లారు. ఇంట్లో ఎవరు లేని గమనించి ఉరేసుకున్నాడు. తల్లి లక్ష్మి కాంతం ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తునట్లు చూసినట్లు ఎస్సై తెలిపారు.

రహదారిపై గుంతలు..ప్రయాణానికి పాట్లు

నవతెలంగాణ-పెంచికల్‌పేట్



మండల కేంద్రం నుండి పెంచికల్‌పేట్, బెజ్జూర్ వెళ్లే ప్రధాన రహదారిపై గుంతలు పడి ఉండడంతో వాహనదారులు ఆ రోడ్డుపై ప్రయాణించడానికి ఇబ్బందులు పడుతున్నారు. రోడ్డుపై ఉన్న గుంతలతో ద్విచక్ర వాహనదారులు, ఆటోలు వెళ్లడానికి భయపడుతూ ప్రమాదాల బారిన పడుతున్నారు. పరిస్థితి దారుణంగా ఉన్న అధికారులు, ప్రజా ప్రతినిధులు గానీ పట్టించుకోవడంలేదని ప్రయాణికులు వాపోతున్నారు. వర్షాకాలం గుంతలలో నీరు ఉండడంతో వాహనదారులు కింద పడిన సందర్భాలున్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి రోడ్డుకు మరమ్మతులు చేయించాలని మండల ప్రజలు, వాహనదారులు కోరుతున్నారు.

పూర్తికాని వంతెనలు...తీరని చింతలు

- ప్రమాదకరంగా వాగులు దాటుతూ..
- ప్రాణాల మీదకు తెచ్చుకుంటున్న వైనం..

నవతెలంగాణ-కెరమెరి

ఏండ్లుగా వంతెనలు లేకపోవడంతో వాగుల్లోంచి వెళ్తూ ఆయా గ్రామాల ప్రజలు నానా ఇబ్బందులు పడేవారు. తీర నిధులు మంజూరు కావడంతో సంతోషపడ్డ.. ఏండ్లుగా పనులు పూర్తి కాకపోవడంతో పరిస్థితి అగమ్య గోచరంగా తయారైంది. అనేక గ్రామాల ప్రజలకు అనుసంధానమైన వంతెనలు సకాలంలో పూర్తి కాకపోవడంతో ఇబ్బందులు తప్పడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వంతెనల మంజూరు కోసం కోట్ల రూపాయలు మంజూరు అయినప్పటికీ పనులు పూర్తి చేయడంలో తీవ్ర జాప్యం జరుగుతుంది. సకాలంలో పనులు పూర్తి చేయించేలా ఉన్నతాధికారులు చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

పలు గ్రామాల ప్రజలకు ఇబ్బందులు

మండల కేంద్రం నుంచి కరంజి వాడ వెళ్లే మార్గంలో అనార్‌పల్లి గ్రామం వద్ద 2016లో సుమారు రూ.2.70 కోట్లు మంజూరయ్యాయి. పనులు పిల్లర్ల దశలో నిలిచిపోయాయి. సంబంధిత గుత్తేదారుకి సుమారు రూ. కోటి బిల్లులు రాకపోవడంతో సదరు గుత్తేదారు కోర్టులో కేసు వేయగా, నేటికి బిల్లులు అందక కోర్టులో కేసు నడుస్తుండడంతో వంతెన పనులు ఇప్పట్లో ప్రారంభమయ్యేలా లేవు. లక్మాపూర్ గ్రామ సమీపంలో సుమారు రూ.3 కోట్లతో వంతెన మంజూరు కాగా చివరి దశలో పనులు నిలిచిపోయాయి. రెండేళ్లలో పూర్తి చేయాలని నిబంధనలు ఉన్నప్పటికీ ఏడేండ్లు అవుతున్న పూర్తి కావడం లేదు. దీంతో మహారాష్ట్ర సరిహద్దులోని కోట, లెండి జాల, శంకర్ లొద్ధితో పాటు పలు గ్రామాలకు రాకపోకలకు సమస్యగా మారింది. దీంతో ఏండ్లుగా పెద్దవాగు పరిసర గ్రామాల ప్రజలు ప్రమాదకరంగా రాకపోకలు కొనసాగిస్తున్నారు. అధికంగా గిరిజన ప్రజలే ఉండడంతో వారి వేదన వర్ణనాతీతంగా మారింది. త్వరితగతిన వంతెన పనులు పూర్తి చేయాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.



పిల్లర్ల వద్ద నిలిచిపోయిన అనార్‌పల్లి బ్రిడ్జి



చివరి దశలో నిలిచిపోయిన లక్మాపూర్ వంతెన

అత్యవసర సమయాల్లో..

ఎగువ ప్రాంతాల్లో ఏ మూలన వర్షం కురిసిన పెద్ద వాగులో నీటి ప్రవాహం పెరుగుతుంది. దీంతో వాగు దాటి మండల కేంద్రానికి చేరుకోలేని దుస్థితి నెలకొంది. వర్షాకాలం కావడంతో పెద్దవాగులో నీటి ప్రవాహం 3 నెలల పాటు ఉంటుంది. దీంతో వ్యవసాయ పనులకు సైతం తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అనారోగ్యంతో బాధపడుతున్నవారిని, గర్భిణీలను ఆస్పత్రులకు తరలించాలంటే వాగు దాటి వెళ్లేందుకు సాహసాలు చేయక తప్పడం లేదు. ద్విచక్ర వాహనాలు, ఆటోలు, ఇతర వాహనాలతో వాగు వద్దకు చేరుకున్నప్పటికి వాగు వద్ద వాహనాలను నిలిపి వేయాల్సిందే. ఈత వచ్చిన వారు మాత్రమే సులభంగా వాగు దాటి గ్రామాలకు వెళ్తున్నారు. ఈత రాని వారు ఇతరుల సాయం కోసం గంటల తరబడి వాగు వద్ద వేచి చూడాల్సి వస్తుందని ఆయా గ్రామాల ప్రజలు వాపోతున్నారు.



వంతెన వద్ద నిలిచిన ద్విచక్ర వాహనాలు

అసంపూర్తి వంతెనలు పూర్తి చేయాలి

రాథోడ్ రూప్‌లాల్ నాయక్, సేవాలాల్ సేన జిల్లా అధ్యక్షుడు



వంతెనలు మంజూరై ఏడేండ్లు అవుతుంది. అనార్‌పల్లి వంతెన పిల్లర్ల దశలో నిలిచిపోయింది. లక్మాపూర్ వంతెన చివరి దశలో ఉంది. పనులను ప్రారంభించేందుకు అధికారులు, ప్రజాప్రతినిధులు చొరవ చూపాలి. ఏండ్ల తరబడి వంతెనలు లేక అనేక కష్టాలు పడుతున్నాం. ఇప్పటికైనా పాలకులు స్పందించి నిలిచిపోయిన వంతెన పనులను పూర్తి చేయాలి.

వంతెన పూర్తి అయితే కష్టాలు తీరుతాయి

రవీందర్ రాథోడ్, లక్మాపూర్



ప్రతి ఏటా పెద్దవాగుతో కష్టాలు పడుతున్నాం. ఒక్కో సారి వాగులో వరద ప్రవాహం ఎక్కువగా ఉన్నా. ఈదుకుంటు వాగు దాటక తప్పడం లేదు. నిర్మాణంలో ఉన్న వంతెన పూర్తి ఇంకా ఇన్నాళ్లు పడుతుందో. పాలకులు అసంపూర్తగా ఉన్న వంతెనలపై దృష్టి సారించడం లేదు. కొన్ని కుటుంబాలు పిల్లల చదువుల కోసం గ్రామాన్ని వదిలి, ఇతర గ్రామాలకు వెళ్లి పోతున్నారు. వంతెన పూర్తై మా కష్టాలు తీరుతాయి.

జోడేఘాట్‌ను సందర్శించిన సివిల్ జడ్జీ



నవతెలంగాణ-కెరమెరి

ఆదివాసుల అమరవీరుడు కుమురం భీం అసువులు బాసిన పోరుగడ్డ జోడేఘాట్‌ను ఆదివారం ఆసిఫాబాద్ సివిల్ జడ్జీ అనంతలక్ష్మి సందర్శించారు. గ్రామస్తులు ఆమెకు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆమె భీం నిలువెత్తు విగ్రహానికి పూలమాలలు వేసి సమాధి వద్ద శ్రద్ధాంజలి ఘటించారు. అనంతరం సమీపంలోనే ఉన్న గిరిజన మ్యూజియంలో కలియ తిరిగారు. మ్యూజియంలో భద్ర పర్చిన ఆదివాసులు ఉపయోగించే వస్తువులు, పాత్రలు, ఆహారపు, అలవాట్లు, వస్త్రాధారణ, ఆభరణాల అలంకరణ, పెళ్లి వేడుక చిత్రాలు, దేవత పూజల చిత్రాలను తిలకించారు. వారి సంస్కృతి, సంప్రదాయాల గూర్చి స్థానికులను అడిగితెల్సుకున్నారు. మొట్టమొదటి సారిగా జోడేఘాట్‌కు రావడంతో స్థానిక మహిళలు శాలువతో సన్మానించి అభినందించారు. కార్యక్రమంలో ఎస్సై గుంపుల విజయ్ కుమార్, కుమురం భీం ఉత్సవ కమిటీ మాజీ చైర్మన్, గ్రామ పటేల్ పెందూర్ రాజేశ్వర్ పాల్గొన్నారు.

జిల్లాలో ముమ్మరంగా వర్షాలు



నవతెలంగాణ-ఆసిఫాబాద్

ఆసిఫాబాద్ జిల్లాలో శనివారం రాత్రి నుండి ఆదివారం ఉదయం వరకు అన్ని మండలాల్లో వర్షపాతం నమోదైంది. నాలుగు రోజులుగా వర్షం లేక ఇబ్బందులు పడుతున్న రైతులకు కొంత ఊరట కలిగించింది. శనివారం రాత్రి జిల్లాలోని అన్ని మండలాల్లో కురిసిన వర్షంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. జిల్లాలో సగటున 37 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదు కాగా మండలాల వారీగా జైనూర్‌లో 37 మీమీ వర్షపాతం కురియగా సిర్పూర్(యు)లో 37.2, లింగాపూర్‌లో 38.4, తిర్యాణిలో 52.4, రెబ్బెనలో 27, ఆసిఫాబాద్‌లో 4.4, కెరమెరిలో 12.4, వాంకిడిలో 16.2, కాగజ్‌నగర్‌లో 41.4, సిర్పూర్(టి)లో 76, కౌటాలలో 43.4, చింతలమానపెల్లి 74.2, బెజ్జూర్‌లో 46, పెంచికల్‌పేట 29.2, దహెగాం 20.8 మీమీల వర్షపాతం కురిసింది. ఎట్టకేలకు జిల్లా వ్యాప్తంగా వర్షపాతం నమోదు కావడంపై రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

వ్యాధుల నివారణకు పారిశుధ్యం పాటించాలి



నవతెలంగాణ-కౌటాల

వ్యాధులను నివారించడానికి పారిశుధ్యంతో పాటు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని వైద్యాధికారి రాజకుమార్ అన్నారు. మండలంలోని గుడ్లబోరి గ్రామంలో ఆదివారం వైద్య శిబిరం నిర్వహించి రోగులకు ఉచితంగా వైద్యం అందించారు. అనంతరం పారిశుధ్యంపై పలు సూచనలు చేశారు. పది రోజుల నుండి గుడ్లబోరి గ్రామంలో చాలామంది విష జ్వరాల బారినపడి జ్వరంతో బాద పడుతున్నారు. జ్వరంతో పాటు ఒళ్ళు నొప్పులు తగ్గకపోవడంతో ఈ విషయాన్ని వైద్యాధికారి దృష్టికి రాగా వెంటనే ఆ గ్రామంలో వైద్య శిబిరం నిర్వహించారు. రోగులను పరీక్షించి మందులను అందించారు. ప్రతి ఒక్కరు ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, మురుగునీరు నిలువ లేకుండా చూసుకోవాలని సూచించారు. పారిశుధ్యం పట్ల నిర్లక్ష్యం వహిస్తే రోగాల బారిన పడి తీవ్రంగా నష్టపోతామన్నారు. వైద్య శిబిరంలో ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలున్నారు.

రిటైర్డ్ ఉద్యోగుల పెండింగ్ బిల్లులు చెల్లించాలి



నవతెలంగాణ-ఆసిఫాబాద్

విశ్రాంత ఉద్యోగుల పెండింగ్ బిల్లులు చెల్లించాలని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు గరిపెల్లి కరుణా గౌడ్ అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విశ్రాంత సంఘ భవనంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. విశ్రాంత ఉద్యోగులకు చెల్లించాల్సిన పెండింగ్ 4 డిఆర్‌లు, ఈహెచ్ఎస్ కార్డుపై అన్ని ఆస్పత్రుల్లో వైద్యం అందించాలన్నారు. పూర్తి స్థాయి వైద్యం అందేలా ప్రత్యేక వైద్యులను నియమించాలని వెల్‌నెస్‌సెంటర్లలో ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. పెండింగ్ మెడికల్ బిల్స్ ఇవ్వాలన్నారు. సమస్యలపై ఈనెల 11న కలెక్టర్‌ను కలిసి విన్నవించడం జరుగుతుందన్నారు. సమావేశంలో బిల్డింగ్ అధ్యక్షులు నాంపల్లి శంకర్, యూనిట్ అధ్యక్షులు రమేష్, కార్యదర్శి మధు సుధన్ గౌడ్, సెక్రటరీ గుర్రాల వెంకటేశ్వర్లు, లింగయ్య, కోశాధికారి సిడం సూరు, సిరాజ్ ఉల్ హాక్, అమలామేరీ, కట్కూరి పెంటయ్య, బాల శ్రీరాములు, పిడుగు రామస్వామి పాల్గొన్నారు.

పోడు సాగు చేస్తున్న ఎస్సీ, బీసీలకు పట్టాలివ్వాలి

నవతెలంగాణ-పెంచికల్‌పేట్

ప్రభుత్వం పోడు భూములకు పట్టాలు ఇవ్వాలని నేతకాని (మహార్) సంఘం రాష్ట్ర అధ్యక్షులు జాడి నర్సయ్య, రాష్ట్ర ఉపాధ్యక్షులు బసర్కార్ విశ్వనాథ్ అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ఉత్తర తెలంగాణ గోదావరి పరివాహక ప్రాంతంలోని ఆదిలాబాద్ నుండి భద్రాచలం వరకు నిరుపేదలు సాగుచేసుకుంటున్న పోడు భూములకు ఆదివాసులతో పాటు ఎస్సీ, బీసీలకు ప్రభుత్వం పట్టాలు ఇవ్వాలని, ఏజెన్సీ ప్రాంతంలో పహనీలు ఇవ్వాలని, నేతకాని మాహార్ కార్పొరేషన్ కేటాయించాలని, సంఘం పరంగా సీఎం రేవంత్ రెడ్డిని కలిసిన సందర్భంగా హామీ ఇచ్చారని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు డోంగ్రే లహన్ రాజ్, ఒంద్రే ప్రేమానందమ్, కర్మే ఏమాజీ, రాజేశ్వర్, శివకుమార్, గోమాస దామోదర్, దుర్గం దాయానంద్, గోమాస చంద్రశేఖర్, కసిపాక శంకర్, గోమాస బక్కయ్య పాల్గొన్నారు.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న నర్సయ్య

బాధిత కుటుంబాన్ని ఆదుకోవాలి



నవతెలంగాణ-కెరమెరి

వాగు నీటిలో మునిగి మరణిచిన చౌదరి జ్యోతి కుటుంబాన్ని ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకోవాలని మాలీ సంఘం డివిజన్ ప్రధాన కార్యదర్శి లెన్గురే బాలాజీ అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. మూడు రోజుల క్రితం సుర్ధపూర్ గ్రామానికి చెందిన చౌదరి జ్యోతి పొలం పనులకు వెళ్లిన భర్తకు సద్ది అన్నం ఇవ్వడానికి వెళ్లి వాగు దాటుతూ లోతు తెలియక నీటిలో మునిగి చనిపోవడంతో మూడేండ్ల చిన్నారి, 6 నెలల పసిపాపా తల్లి ప్రేమకు దూరమయ్యారని ఆవేధన వ్యక్తం చేశారు. కుమురం భీం ప్రాజెక్టు బ్యాక్ వాటర్ కొన్నేండ్లుగా నిల్వ ఉండడంతోనే జ్యోతి మృతి చెందిందని ఆరోపించారు. కుమురం భీం ప్రాజెక్టు బ్యాక్ వాటర్ వల్ల రైతులు ఇబ్బందులు పడుతున్నారని వాపోయారు. అధికార యంత్రాంగం వాగు వద్ద ప్రమాదం సూచికలు ఏర్పాటు చేసి ఉంటే ప్రమాదం జరిగి ఉండేది కాదన్నారు. వర్షాకాలం మొదలు వేసవి వరకు బ్యాక్ వాటర్‌తో సుర్ధపూర్ వద్ద వాగులో నీళ్ల నిల్వ ఉండడంతో పొలం పనులకు వెళ్లే రైతులకు ఎక్కడ నీళ్లు ఎక్కువగా తక్కువగా ఉన్నాయో అర్థం కాని పరిస్థితి ఏర్పడిందని పేర్కొన్నారు. దీంతో ప్రమాదాలు జరుగుతున్నాయని తెలిపారు. మృతురాలికి ఇద్దరు చిన్నారులున్నారని, వారిని ప్రభుత్వం ఆదుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మాలీ సంఘం మాజీ మండల అధ్యక్షుడు వాడై సుభాష్, నాందేవ్, నికోడే శ్రావణ్ పాల్గొన్నారు.

డిజిటల్ లావాదేవీలు పెంచే దిశగా యాప్

- గూగుల్ పే, ఫోన్ పేలకు ధీటుగా 'డాక్ పే' రూపకల్పన
- సమస్యల పరిష్కారానికి టోల్ ఫ్రీ 155299



నవతెలంగాణ-దహెగాం

దేశంలో డిజిటల్ లావాదేవీలను పెంచే దిశగా తపాలాశాఖ వినియోగదారులకు పలు రకాల సేవలను అందించడంలో ఆసక్తి చూపుతోంది. ఉత్తరాలు, మనీ ఆర్డర్లు, కొరియర్, స్పీడ్ పోస్టుతో పాటు ప్రయివేటు సంస్థలకు ధీటుగా బ్యాంకింగ్, గోల్డ్ బాండ్, బీమా తదితర సేవలను ఇప్పటికే అందుబాటులోకి తెచ్చింది. మరో అడుగు ముందుకేసి డిజిటల్ లావాదేవీల పెంపునకు గూగుల్ పే, ఫోన్ పే మాదిరిగా డాక్ పే అనే యాప్‌ను 2021లోనే దేశ వ్యాప్తంగా అందుబా టులోకి తీసుకొచ్చింది. ఇప్పుడు దీనిని ప్రజలకు చేరువ చేసే దిశగా దూసుకెళుతోంది. ఈ డాక్ పే ద్వారా ప్రజలు డిజిటల్ ఫైనాన్స్ సేవలు పొందడంతో పాటు ఇండియా పోస్టు, ఐపీపీబీ, అందించే బ్యాంకింగ్ సేవల విషయమై సాయం పొందవచ్చు. డబ్బు పంపడం, క్యూఆర్ కోడ్ స్కాన్ చేయడం, డిజిటల్ రూపంలో వ్యాపారులకు నగదు చెల్లించడం లాంటి పనులను చక్కబెట్టుకోవచ్చు. ప్రతి భారతీయుడి అవసరాలను తీర్చేలా డాక్ పేను రూపొందించారు. ప్రధానంగా గ్రామీణ ప్రాంతాలలో యూపీఐ డిజిటల్ చెల్లింపులను ప్రోత్సహించే దిశగా దీనిని ఎప్పటికప్పుడు ఆధునికీకరిస్తున్నారు. ఈ యాప్‌ను ఏ బ్యాంకు ఖాతాదారుడైనా వినియోగించవచ్చు.

గ్రీవెన్స్ వెసులుబాటు

గూగుల్ పే, ఫోన్ పే నగదు లావాదేవీల్లో ఏవైనా పొరపాట్లు చోటుచేసుకుంటే ఫిర్యాదులు చేసేందుకు అవకాశం ఉండదు. ఎందుకంటే వాటి కార్యాలయాలు మనకు అందుబాటులో ఉండవు. అయితే డాక్ పే యాప్ ద్వారా నగదు బదిలీ సమయంలో ఏదైనా పొరపాటు జరిగితే ఫిర్యాదుల స్వీకరణకు తపాలా శాఖ వెసులుబాటు కల్పించింది. డాక్ పే అనే యాప్ తపాలాశాఖ కేంద్ర ప్రభుత్వ ఆధీనంలోనే పనిచేస్తుండటంతో మన డబ్బుకు గ్యారెంటీ ఉంటుంది. యాప్ గురించి సమగ్ర సమాచారం కోసం ఐపీపీబీ టోల్ ఫ్రీ నంబర్ 155299ను వినియోగదారులు సంప్రదించొచ్చని తపాలా శాఖా అధికారులు చెబుతున్నారు.

కన్నుల పండువగా జగన్నాథ రథయాత్ర

నవతెలంగాణ-కాగజ్‌నగర్ రూరల్

ఒడిశా రాష్ట్రంలోని పూరిలో నిర్వహించిన జగన్నాథరథ యాత్ర తరహాలోనే ఆదివారం సాయంత్రం కాగజ్‌నగర్ మండలం నజ్రూల్‌నగర్ పంచాయతీలోని మార్కెట్ ఏరియాలో కాందిశీకులు అత్యంత వైభవంగా నిర్వహించారు. దాదాపు మూడు గంటల పాటు కొనసాగిన రథయాత్రలో భక్తజనం పోటీ పడింది. నజ్రూల్‌నగర్ పంచాయతీలోని వేదమందిర్ నుంచి ప్రారంభమైన యాత్ర గణేష్ మందిర్ వరకు కొనసాగింది. ఉమ్మడి నజ్రూల్‌నగర్ పంచాయతీలోని 13 గ్రామాల్లోని భక్తజనంతో పాటు మండలంలోని ఈర్గాం, నామానగర్, సీతానగర్, గన్నారం తదితర గ్రామాల్లోని భక్తజనం తరలిరావడంతో సందడిగా మారింది. అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా రూరల్ సీఐ అల్లం రాంబాబు ఆధ్వర్యంలో ఎస్సై రామన్ కుమార్ పోలీసులు బందోబస్తు నిర్వహించారు. కార్యక్రమంలో ఉత్సవ కమిటీ సభ్యులు సమీరత్ మండల్, బలాయ్ మండల్, అమిల్దాస్, భాజపా జిల్లా అధ్యక్షుడు డాక్టర్ కొత్తపల్లి శ్రీనివాస్, నాయకులు కొంగ సత్యనారాయణ, బికాస్పరామీ, వీరభద్రచారి, అరణ్య పాల్గొన్నారు.

ఘనంగా ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవం

నవతెలంగాణ-ఆసిఫాబాద్



సామాజిక సమానత్వం కోసం పోరాడిన వ్యక్తి మందకృష్ణ మాదిగ అని మాజీ జడ్పీటీసీ అరిగెల నాగేశ్వరరావు అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలో ఎమ్మార్పీఎస్ 30వ ఆవిర్భావ దినోత్సవ మహాసభలో ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దళిత జాతి అభ్యున్నతి కోసం, ఏబీసీడీ వర్గీకరణకై 29 ఏండ్లుగా ఉద్యమిస్తున్నట్లు తెలిపారు. ఎస్సీ వర్గీకరణ కోసం, అలుపెరగని పోరాటం చేసి ప్రధానమంత్రి నరేంద్ర మోదీ చేత ప్రకటన చేయించి, కమిటీ ఏర్పాటు చేయించిన అసాధ్యుడు మంద కృష్ణ అని కొనియాడారు. అనంతరం భారత మాజీ ఉప ప్రధాని బాబూ జగ్జీవన్ రాం వర్ధంతి వేడుకలు ఘనంగా జరుపుకున్నారు. జగ్జీవన్ రాం విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. దేశానికి జగ్జీవన్‌రాం చేసిన సేవలను కొనియాడారు. ఆయన చూపిన మార్గంలో పయనిస్తు ఆశయ సాధనకు కృషి చేయాలని పిలుపు నిచ్చారు. కార్యక్రమంలో వారితో పాటు ఎమ్మార్పీఎస్ జాతీయ ఉపాధ్యక్షుడు రేగుంట కేశవరావు మాదిగ, ఎస్సీ ఉపాధ్యక్షులు జయరాజ్, మాజీ సర్పంచ్ సత్తన్న, బీజేపీ సీనియర్ నాయకులు శ్రీకాంత్, సంతోష్, శ్రీశైలం పాల్గొన్నారు.

రాష్ట్రీయ స్వయం సేవక్‌సంఘ్ ఆధ్వర్యంలో గురుపూజ

నవతెలంగాణ-ఆసిఫాబాద్

రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ ఆధ్వర్యంలో ఆదివారం మండల కేంద్రంలోని శ్రీ సరస్వతి శిశుమందిర్‌లో గురుపూజ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా భోనగిరి సతీష్ బాబు, దువులూరి మురళీధర్ ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. స్వయం సేవకులందరికి కాషాయ ధ్వజంను గురువుగా భావించి పూజ చేస్తారని తెలిపారు. కార్యక్రమంలో ఖండ కార్యవాహ గుండేటి కోటేశ్వరరావు, ఖండ కార్యకారిణీ, గుర్రాల వెంకటేశ్వర్లు, నాగుల శ్రీనివాస్, కొడిపాక వేణుగోపాల్, నల్లగొండ రమేష్, వైరాగరె ప్రభోధ్ కుమార్, లక్ష్మీకాంత్ ఆచార్య, మదునయ్య ముక్క కృష్ణమూర్తి, పెండ్యాల సదాశివ్, ఈదులవాడ గణేష్, శ్రావణ్ గౌడ్, గడ్డల ప్రణయ్, మేంగ్రే సాయి, వర్షిత్, సాయిశివ, మణికంఠ, ఇస్తారి పాల్గొన్నారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
మంచిర్యాల
సోమవారం | జులై 08, 2024 | www.navatelangana.com

ఘనంగా మందకృష్ణ మాదిగ జన్మదిన వేడుకలు

నవతెలంగాణ-లక్షెట్టిపేట



పట్టణంలో ఐబీ గెస్ట్ హౌస్ ప్రాంగణంలో అంబేద్కర్ సంఘం పట్టణ ఉపాధ్యక్షుడు కళ్లేపల్లి విక్రమ్ ఆధ్వర్యంలో ఎమ్మార్పీఎస్ అధినేత, వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ 60వ జన్మదిన సందర్భంగా కేకు కట్ చేసి స్వీట్లు పంచారు. ఈ కార్యక్రమంలో అల్ ఇండియా అంబెడ్కర్ సంఘం జిల్లా కోకన్వీనర్ కొల్లూరి రవికుమార్, దర్శనలా. నవీన్, శతరాజీ, ఈశ్వర్, వెంకటేష్, మహేష్, దుర్గాప్రసాద్, శివ, లడ్డు, రాకేష్ పాల్గొన్నారు.

మాజీ ఎంపీపీ దంపతులకు ఘన సన్మానం

నవతెలంగాణ-జన్నారం



మండల మాజీ ఎంపీపీ మాదాడి సర్వజన రవీందర్రావు దంపతులను ఆదివారం మండల గౌడ సంఘం ఆధ్వర్యంలో శాలువా పూలమాలతో ఘనంగా సన్మానించారు. సందర్భంగా గౌడ సంఘం మండల అధ్యక్షుడు మూల భాస్కర్‌గౌడ్ మాట్లాడుతూ అధికారంలో ఉన్నప్పుడు ప్రజలకు ఆమె చేసిన సేవలు గుర్తుండిపోతాయన్నారు. మండల అభివృద్ధిలో ఎంపీపీ పాత్ర కీలకమన్నారు. సంఘం నాయకులు రాజుల లింగన్న గౌడ్, సతీశ్ గౌడ్ పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



నవతెలంగాణ-లక్షెట్టిపేట

పట్టణంలోని యూపీఎస్ పాఠశాలలో 1985 నుంచి 1991వరకు చదువుకున్న విద్యార్థులంతా ఆదివారం కలుసుకున్నారు. పట్టణంలోని కేఎస్ఆర్ ఫంక్షన్ హాల్‌లో పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి పలువురు రిటైర్డ్ ఉపాధ్యాయులు ప్రస్తుత ఉపాధ్యాయులు మాట్లాడారు. 1985 నుంచి 1991వరకు యూపీఎస్ పాఠశాలలో చదువుకున్న విద్యార్థులు పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించడం చాలా సంతోషంగా ఉందని అన్నారు. ఈ సందర్భంగా పలువురు గురువులకు శాలువాలతో సన్మానించి మెమొంటోలను అందజేశారు. విద్యార్థులంతా ఒకరినొకరు పలకరించి చిన్ననాటి జ్ఞాపకాలను నెమరు వేసుకుని ఆటపాటలతో హోరెత్తించారు. ఈ కార్యక్రమాన్ని ఆర్గనైజర్స్ గుత్తికొండ శ్రీధర్ వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు కుబ్జా దేవి, సువర్ణ, లను పూర్వ విద్యార్థులంతా సన్మానించి సత్కరించి జ్ఞాపకాలు నెమరు వేసుకున్నారు. ఈ కార్యక్రమంలో పలువురు పూర్వ విద్యార్థులు సుదూర ప్రాంతాల నుండి వచ్చి పూర్వ విద్యార్థుల సమ్మేళన కార్యక్రమంలో విజయవంతం చేసిన విద్యార్థులు అందరూ ఆర్గనైజర్ గుత్తికొండ శ్రీధర్‌ను అభినందించారు..

కరాటే మాస్టర్స్ అధ్యక్షురాలిగా మోకపల్లి నాగలక్ష్మి



నవతెలంగాణ-నస్పూర్

మంచిర్యాల, ఆసిఫాబాద్ ఉమ్మడి జిల్లాల కరాటే మాస్టర్ల అధ్యక్షులుగా మోకపల్లి నాగలక్ష్మిని ఎన్నికున్నారు. ఆదివారం నస్పూర్‌లోని మాస్టర్ గ్రామర్ హైస్కూల్లో మంచిర్యాల, ఆసిఫాబాద్ జిల్లాల నూతన కరాటే మాస్టర్స్ కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ప్రధాన కార్యదర్శిగా రంగు శ్రీనివాస్, కోశాధికారిగా పోచంపల్లి వెంకటేష్, ఉపాధ్యక్షులుగా కుందేలు రవి, నర్సయ్య, మోయిన్, రంగ రమేష్, జాయింట్ సెక్రటరీగా సౌమ్య, చందు, ఆర్గనైజింగ్ సెక్రెటరీ కర్ర వెంకటేష్‌ను ఎన్నుకున్నారు.

మాంసాహారం దుకాణాల తనిఖీలు



నవతెలంగాణ-రామకష్టాపూర్

పట్టణంలోని మాంసాహార దుకాణాలను ఆదివారం మున్సిపల్ కమిషనర్ ఎస్ మురళీకృష్ణ, ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. స్థానిక రాజీవ్ చౌక్ ప్రాంతము నందు గల వివిధ ప్రదేశాల నందు నిర్వహించబడుతున్న మటన్, చికెన్, చేపల అమ్మకదారుల యొక్క దుకాణాలను చేశారు. విక్రయదారులందరికి నియమనిబద్ధముల అనుకూలముగా ప్రజల ఆరోగ్యర్థముగా తమ తమ దుకాణములో ఈగల, దోమల తెరలను వినియోగిస్తూ విక్రయాలు జరుపవలసినదిగా ఆదేశించారు. షరతులను ఉల్లఘించి ప్రవర్తిస్తే మున్సిపల్ చట్టం 2019 ప్రకారం చట్టరీత్యా చర్యలు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమము శానిటరీ ఇన్స్‌పెక్టర్ సీహెచ్ ప్రదీప్ కుమార్, పర్యావరణ ఇన్‌జనీర్ బి సంతోష్ కుమార్ పాల్గొన్నారు.

మైసమ్మకు పూజలు



కాసిపేట : మండలంలోని దేవాపూర్ నాయకపుగూడలో చెరువు కట్ట మైసమ్మకు గిరిజన రైతులు ఘనంగా పూజలు చేశారు. వానలు బాగా కురువాలని చెరువు నిండాలని, పంటలు బాగా పండాలని, ప్రజలందరూ సుఖ సంతోషాలతో ఉండాలని కోరుకుంటూ పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో సీడం లాల్, బహుదూర్ పూజారి కనక రాము, సిడం రామ్ దాస్, సిడం జలపతి, కొమ్ముల సంజీవ్, రామ్ చందర్ పాల్గొన్నారు.

21న బోనాల జాతర

కాగజ్‌నగర్ రూరల్ : కాగజ్‌నగర్ పట్టణంలో ఈ నెల 21న మహంకాళి బోనాల జాతర నిర్వహించనున్నట్టు జాతర ఉత్సవ కమిటీ అధ్యక్షుడు తుమ్మ రమేష్ తెలిపారు. బోనాల పండుగ నిర్వహణపై ఆదివారం ఆలయంలో కమిటీ సభ్యుల సమావేశం నిర్వహించారు. భక్తుల సౌకర్యాలపై చర్చించారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు తుమ్మ రమేష్ మాట్లాడుతూ భక్తులు ఎలాంటి అసౌకర్యానికి గురికాకుండా పూర్తి స్థాయిలో ఏర్పాట్లు చేయనున్నట్టు తెలిపారు. పట్టణంలోని లారీ చౌరస్తా నుంచి బోనాలతో శోభాయాత్ర ప్రారంభమై సర్సిల్క్‌లోని మహంకాళి ఆలయం వద్దకు చేరుకుంటుందన్నారు. అనంతరం ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు తెలిపారు. శోభాయాత్రలో బోనాలతో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు ఒల్లాల సోమనాథం, ఓంప్రకాష, కూరపాటి జగదీష్, బడుగు వీరస్వామి, సుబ్రహ్మణ్యం, శ్రీనివాస్, శివకుమార్, వెంకటేష్, పెరక కృష్ణ పాల్గొన్నారు.

మహిళలపై అగాయిత్యాలు అరికట్టాలి

- నెల వ్యవధిలో ఐదుగురు ఆత్మహత్య
- ఐద్వా జిల్లా గౌరవ అధ్యక్షురాలు దాసరి రాజేశ్వరి



నవతెలంగాణ-జైపూర్

కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న తప్పుడు విధానాల ఫలితంగా మహిళలపై నానాటికి అగాయిత్యాలు పెరుగుతున్నాయని ఐద్వా జిల్లా గౌరవ అధ్యక్షురాలు దాసరి రాజేశ్వరి అన్నారు. ఆదివారం చెన్నూర్ పట్టణంలో ఏర్పాటు చేసిన ఐద్వా (అఖిల భారత ప్రజాతంత్ర మహిళ సంఘం) జనరల్ బాడీ సమావేశం నిర్వహించారు. ఈ సంధర్భంగా ఆమె మాట్లాడుతూ గడిచిన నెల రోజుల వ్యవధిలో మంచిర్యాల జిల్లా పరిధిలో ఐదుగురు మహిళలు ఆత్మహత్య చేసుకున్నారని ఆవేధన వ్యక్తం చేశారు. ఉద్యోగ ఉపాధి అవకాశాలు లేక మద్యం, గంజాయి, జూదం తదితర చెడు వ్యవసనాలకు బానిసైన పురుషులు మహిళలను హింసకు గురి చేసే సంస్కృతి జిల్లా పరిధిలో పెరిగిపోతుందని అన్నారు. మహిళలను కూలీలుగా చిత్రీకరించి వారు చేస్తున్న శ్రమను తక్కువ చేసి చూస్తున్నారని, వారు ఎదుర్కొంటున్న బాధలు ఎవరితో చెప్పుకోవాలో పాలుపోక సతమతమైపోతున్నారని ఆవేధన వ్యక్తం చేశారు. మహిళల రక్షణ కోసం అనేక చట్టాలు తీసుకొచ్చామని చెపుతున్న పాలకులు మహిళలపై జరుగుతున్న హింసను అరికట్టలేకపోతున్నారని ఆరోపించారు. ఈ సంధర్భంగా అఖిల భారత ప్రజాతంత్ర మహిళ సంఘం(ఐద్వా) చెన్నూర్ మండల జనరల్ బాడీ నూతన కమిటీని ఎన్నుకున్నారు.

నూతనంగా ఎన్నికైన మండల కమిటీ సభ్యులు

చెన్నూర్ మండల ఐద్వా నూతన కమిటి అధ్యక్షరాలుగా బండారి రాజేశ్వరి, గౌరవ అధ్యక్షురాలిగా మేడి రాజేశ్వరి, అధ్యక్షులుగా బండారి రాజేశ్వరి, ప్రధాన కార్యదర్శిగా బోగె నాగజ్యోతి, కోశాధికారిగా రాతిపల్లి సంధ్య, ఉపాధ్యక్షులుగా తుమ్మ రేణుక, గావిడి భూదేవి, సహాయ కార్యదర్శిగా జడల యామిని, కామెర సరిత, కమిటీ సభ్యులుగా బొడ్ల సరిత, బోయిరే రమాదేవి, ఎస్కే సహాన బేగం, మద్ది శంకరమ్మ ఎన్నికయ్యారు.

మూడు దశాబ్దాలుగా కొనసాగుతున్న ఎమ్మార్పీఎస్ పోరాటం



నవతెలంగాణ-జైపూర్

ఎమ్మార్పీఎస్ ఆవిర్భవించి మూడు దశాబ్దాలు పూర్తి చేసుకుందని, ఎమ్మార్పీఎస్ ఆవిర్భావం నుండి ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాల అభ్యున్నతి కోసం పోరాటం కొనసాగుతుందని ఎమ్మార్పీఎస్ నాయకులు అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా జెండా ఆవిష్కరించిన నాయకులు మాట్లాడారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిలుగా డాక్టర్ జానపాటి శరత్ బాబు, సీపీఐ బెల్లంపల్లి నియోజకవర్గం నాయకులు రేగుంట చంద్రశేఖర్, జిల్లా జనరల్ సెక్రెటరీ సుందిళ్ల మల్లేష్, ఉపాధ్యక్షులు జలంపల్లి శ్రీనివాస్ హాజరై ప్రసంగించారు. ముందుగా డాక్టర్ బాబా సాహెబ్ అంబేద్కర్ చిత్ర పటానికి పూలమాల వేసి నివాళ్లు అర్పించిన నాయకులు అంబేద్కర్ అందరి వారని అందరికి సబంధించిన మహానుభావుడని, రాజ్యాంగాన్ని రచించి భారతీయుల మదిలో నిలిచిపోయారని కొనియాడారు. కాగా 1994 సంవత్సరం జూలై 7న ఎమ్మార్పీఎస్ ఆవిర్భవించిందని, ఆనాటి నుండి ఈనాటి వరకు వ్యవస్థాపక అధ్యక్షులు మంద కృష్ణ మాదిగ పోరాటం నిరంతరాయంగా కొనసాగుతూనేవుందని అన్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ఆరోగ్య శ్రీ, వికలాంగులకు పింఛన్ ఎమ్మార్పీఎస్ పోరాట ఫలితంగా అమలులోకి వచ్చిందని అన్నారు. అణగారిన ప్రజలలో చేతన్యం తీసుకురావడంతో పాటు అంటరానితనం లేకుండా సమానత్వం వచ్చిందని పేర్కొన్నారు. ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షులు రామగిరి రాము ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులతో పాటు కాంగ్రెస్ యువ నాయకులు పాల్గొన్నారు.

క్రమశిక్షణ చర్యలకు ఎరుపు, పసుపు కార్డుల జారి సరికాదు

నవతెలంగాణ-నస్పూర్

సింగరేణి యాజమాన్యం ఎరుపు రంగు, పసుపు రంగు కార్డులను ప్రవేశపెట్టాలనే నిర్ణయాన్ని గుర్తింపు కార్మిక సంఘం (ఏఐటీయూసీ)గా తీవ్రంగా వ్యతిరేఖిస్తున్నామని సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ డిప్యూటీ ప్రధాన కార్యదర్శులు కందికట్ల వీరభద్రయ్య, ముస్కే సమ్మయ్య, బ్రాంచ్ కార్యదర్శి ఎస్కే బాజీసైదా ఒక ప్రకటనలో పేర్కొనారు. యాజమాన్యం మైనింగ్ స్టాఫ్, కార్మికులలో అయోమయాన్ని రేకెత్తించడానికి యాజమాన్యం ఏకపక్షంగా ఎరుపు రంగు కార్డు, పసుపు రంగుకార్డు ప్రవేశపెట్టాలని యోచనలో ఉన్నట్టు యాజమాన్య నిర్ణయాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామని పేర్కొన్నారు. యాజమాన్యానికి ఉత్పత్తిపై ఉన్న శ్రద్ధ కార్మికుల సంక్షేమంపై లేదన్నారు. యాజమాన్యం మైనింగ్ స్టాఫ్ అధికారులపై ఒత్తిడి పెంచడానికి నిర్ణయం తీసుకున్నట్టు మైనింగ్ స్టాఫ్ సోదరులపై ఒత్తిడి పెంచడం వల్ల వారు కార్మికులకుపై పని భారం పెంచుతారని దానివల్ల కార్మికులు ఆందోళనకు గురయ్యే అవకాశాలు ఉన్నాయన్నారు. యాజమాన్యానికి నిజంగా రక్షణపై చిత్తశుద్ధి ఉంటే గుర్తింపు సంఘం ఎన్నికలు గడిచి 6 నెలల కాలం గడుస్తున్న కనీసం ఇప్పటివరకు సేఫ్టీ ట్రైపార్టైట్, స్ట్రక్చర్ సమావేశాలు ఎందుకు నిర్వహించడం లేదని వారు ఈ సందర్భంగా ప్రశ్నించారు. ఇంత పెద్ద ప్రభుత్వ రంగ సంస్థ అయిన సింగరేణిలో యాజమాన్యం పూర్తిస్థాయి డైరెక్టర్ పా లేకుండానే పాలన కొనసాగిస్తుందన్నారు. యాజమాన్యం ఇలాంటి ఎరుపు రంగు, పసుపు రంగు కార్డులను జారీ చేసే నిర్ణయాన్ని వెనక్కి తీసుకోకపోతే గుర్తింపు కార్మిక సంఘం(ఏఐటీయూసీ)గా ఆందోళనను ఉద్రుక్తం చేస్తామని హెచ్చరించారు.

తెలంగాణ ఆర్టిస్టులను ప్రభుత్వం ఆదుకోవాలి

- రాష్ట్ర అధ్యక్షుడు తాళ్లపల్లి రాజేశ్వర్



నవతెలంగాణ-జన్నారం

ఆర్టిస్టులను ప్రభుత్వం ఆదుకోవాలని తెలంగాణ ఆర్టిస్టల సంక్షేమ సమితి రాష్ట్ర అధ్యక్షుడు తాళ్లపల్లి రాజేశ్వర్ డిమాండ్. ఆదివారం మండల కేంద్రంలోని పీఆర్టీయూ భవన్‌లో రాష్ట్ర ముఖ్య నాయకుల ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణలోని చిత్రకారులను అనేక సమస్యలను ఎదుర్కొంటున్నారని ప్రభుత్వాలు ఎన్ని మారినా ఆర్టిస్టులను విష్మయిస్తున్నారు. ఇది చాలా బాధాకరం తెలంగాణలోని ఆర్టిస్టులను ప్రభుత్వం గుర్తించి ఆర్టిస్టుల సంక్షేమానికి తక్షణమే కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఆర్టిస్టుల కుటుంబాలను గుర్తించి వారికి ఉచితంగా విద్య వైద్యం అందించాలి ప్రమాదము భీమా సౌకర్యం కల్పించాలి. నిరుపేదలైన ఆర్టిస్టుల కుటుంబాలకు ఇల్లు ఇండ్ల స్థలాలు లేని వారిని గుర్తించి వెంటనే ఇండ్లు మంజూరు చేసి ఆదుకోవాలి. ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి గందేవర్ రామకృష్ణ ముఖ్య సలహాదారులు కంకణాల సత్యనారాయణ సభ అధ్యక్షుడు సత్యం ఆర్ట్స్ పెద్దపల్లి మాజీ జిల్లా అధ్యక్షులు సత్యనారాయణ, సత్య కళ ఆర్ట్స్ గజ్వేల్ సిద్దిపేట జిల్లా రాజనాథ్, రాష్ట్ర నాయకులు జగిత్యాల జిల్లా విశ్వతేజ, రాష్ట్ర నాయకులు బాలకృష్ణ, నిర్మల్ జిల్లా అధ్యక్షుడు సిద్దిపేట జిల్లా యాదవరావు, రాష్ట్ర నాయకులు యాదగిరి పాల్గొన్నారు.

పోలీస్ వ్యవస్థలో కూడా కులమా

నవతెలంగాణ-కాసిపేట

చట్టాన్ని కాపాడాల్సిన పోలీస్ వ్యవస్థలో కులాన్ని అంట కట్టి ఒక ఎస్సై ఆత్మహత్య చేసుకునే విధంగా కుల అహంకారంతో ప్రవర్తించిన సీఐ జితేందర్ రెడ్డిని విధుల నుంచి బహిష్కరించి చట్టపరంగా చర్యలు తీసుకోవాలని ఎంఆర్పీఎస్ జిల్లా ఇన్‌చార్జి కల్వల శరత్ మాదిగ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక రెడ్ల, అగ్రవర్ణ అహంకార పరిపాలన మితిమీరి పోయిందని, సీఐ జితేందర్‌రెడ్డి కాబట్టే ఒక దళిత ఎస్ఐ శ్రీనివాస్‌ను అశ్వరావుపేట పోలీస్‌స్టేషన్ లో అనేక రకాలుగా మానసికంగా వేధిస్తూ సీఐతో పాటు కొంతమంది కానిస్టేబుళ్ల సీఐతో కుమ్మక్కై, ఎస్ఐ శ్రీరాముల శ్రీనివాస్‌ను ఆత్మహత్య చేసుకునే విధంగా వేధింపులకు గురి చేశారన్నారు. చట్టాన్ని కాపాడాల్సిన పోలీసు అధికారులను కూడా దళితులు అనే కారణంతో చిన్న చూపు చూస్తూ అధికారులను అనేక రకాలుగా ఇబ్బందులకు గురి చేస్తున్నారని, ప్రభుత్వం కూడా చూసి చూడనట్లు వ్యవహరించడం చాలా దారుణమని స్పష్టం చేశారు. ప్రజా రక్షణకు పాటుపడే ఓ పోలీసు అధికారి, కుల వివక్షకు గురి కావడం దారుణమని ఆవేధన వ్యక్తం చేశారు. ఈ ప్రభుత్వంలో పోస్టింగ్‌లలో కూడా దళిత అధికారులకు పోస్టింగ్ లేకుండా పోయిందని, అంటే దళిత అధికారులు పోస్టింగుకు పనికిరారా, అగ్రవర్ణ అధికారుల ఆటలు ఇక నుండి సాగనివ్వమని, తక్షణమే ప్రభుత్వం స్పందించి ఆ కుటుంబాన్ని ఆదుకొని, దీంట్లో ఎవరెవరికి భాగస్వామ్యం ఉందో విచారణ జరిపి చట్టపరంగా న్యాయం చేయాల్సిందిగా కోరుతున్నట్లు పేర్కొన్నారు.

డ్రగ్స్ వినియోగాన్ని అరికట్టేందుకు సహకరించాలి

- తాండూర్ సీఐ కుమారస్వామి



నవతెలంగాణ-తాండూర్

సమాజంలో డ్రగ్స్ గంజాయి మారకద్రవ్యాల నిర్మూలనకు ప్రజలంతా సహకరించాలని తాండూర్ సీఐ కుమారస్వామి కోరారు. ఆదివారం తాండూర్ సిఐ కార్యాలయంలో నాయకులకు స్వచ్ఛంద సేవా సంస్థల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డ్రగ్స్ గంజాయి మారకద్రవ్యాలు అమ్మకాలు జరిగితే సమాచారం అందించాలని కోరారు. సమాజంలో డ్రగ్స్ నిర్మూలన సమిష్టి బాధ్యతగా తీసుకోవాలని కోరారు. గంజాయి డ్రగ్స్‌కు అలవాటు పడ్డ యువకులు తమ జీవితాలను కోల్పోతున్నారన్నారు. గంజాయి డ్రగ్స్ వ్యసనాలు సంపూర్ణంగా నిర్మూలించేందుకు స్వచ్ఛంద సేవా సంస్థలు, స్వయం సహాయక సంఘాలు, కార్మిక సంఘాలు వివిధ పార్టీల నాయకులు సహకరించాలని కోరారు. గంజాయి డ్రగ్స్ నిర్మూలనకు పోలీస్ శాఖ కృషి చేస్తుందన్నారు. అందుకుగాను పాఠశాలల్లో కళాశాలల్లో విద్యార్థులకు డ్రగ్స్‌పై అవగాహన కల్పిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు ఎండీ ఈసా, సూరం రవీందర్, పూసాల ప్రణయ్ కుమార్ పాల్గొన్నారు.

విద్యుత్ షాక్‌తో మహిళా మృతి



నవతెలంగాణ-నస్పూర్

విద్యుత్ షాక్ తగిలి మహిళ మృతి చెందిన సంఘటన శ్రీరాంపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని కృష్ణాకాలనిలో చోటు చేసుకుంది. శ్రీరాంపూర్ ఎస్ఐ సంతోష్ తెలిపిన వివరాల ప్రకారం.. శ్రీరాంపూర్ ఏరియా కృష్ణా కాలనికి చెందిన తీగల శారద(46) ఆదివారం ఇంటి ఆవరణలో రేకుల షెడ్డు కింద బట్టలు ఆరేస్తుండగా ప్రమాదవశాత్తు విద్యుత్ షాక్ తగిలి మహిళా అక్కడికక్కడే మృతి చెందింది విద్యుత్ షాక్ తగిలిందని స్థానికులు గమనించి పోలీసులకు సమాచారం అందించగా ఘటన స్థలానికి చేరుకొని పరిశీలించారు. కుమారుడు వంశీ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు తెలిపారు. వర్షాకాలంలో ప్రజలు విద్యుత్, ఎలక్ట్రిక్ పోల్స్ వద్ద నీటి తాకిడి లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మంచిర్యాల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

ఘనంగా ముక్కిడి పోచమ్మ బోనాలు



నవతెలంగాణ-నస్పూర్

నస్పూర్‌లోని ముక్కిడి పోచమ్మ దేవాలయంలో పోచమ్మ బోనాల పండుగను శ్రీరాంపూర్ జీఎం సంజీవరెడ్డి ఆదివారం ఘనంగా ప్రారంభించారు. ప్రతి ఏటా ఆషాడ మాసంలో మొదలయ్యే పోచమ్మ బోనాలు భక్తులు అత్యంత భక్తి శ్రద్ధలతో అమ్మవారికి బోనాలు సమర్పించుకొని మొక్కులు చెల్లించుకుంటారు. ఆదివారం జీఎం దంపతులు సంజీవరెడ్డి, రాధాకుమారి, మున్సిపల్ చైర్మన్ సురిమిళ్ళ వేణు నస్పూర్‌లోని తెలంగాణ తల్లి విగ్రహం నుండి ఆటపాటలతో ఊరేగింపుగా వెళ్లి ముక్కిడి పోచమ్మకు మొక్కులు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా జీఎం మాట్లాడుతూ సింగరేణి ఏరియాలో నివసిస్తున్న ప్రజలందరూ సుఖశాంతులతో, ఆయురారోగ్యాలతో ఉండేలా చూడాలని కోరుకున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఒకటో వార్డ్ కౌన్సిలర్ బండి పద్మ, భక్తులు పాల్గొన్నారు.

పొన్కల్‌లో పోచమ్మ బోనాలు

నవతెలంగాణ-జన్నారం

మండలంలోని పొన్కల్ గ్రామంలో గౌడ సంఘం అద్వర్యంలో ఆదివారం పొచమ్మతో పాటు ఎల్లమ్మకు బోనాలను సమర్పించారు. మహిళలు బోనాలను నెత్తిన ఎత్తుకొని పోచమ్మ, ఎల్లమ్మ ఆలయాల వరకు డప్పు చప్పుల్లతో ర్యాలీగా వెళ్లి నైవేద్యాలతో అమ్మ వార్లకు సమర్పించి ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో పొనకల్ గౌడ సంఘం ప్రెసిడెంట్ పొడేటి సతీశ్ గౌడ్, గౌడ సంఘం మండల ప్రెసిడెంట్ మూల బాస్కర్‌గౌడ్, జిల్లా నాయకులు బాలసాని శ్రీనివాస్ గౌడ్, మండల నాయకులు ఎరుకల రమేష్ గౌడ్, శంకర్ గౌడ్, రవి గౌడ్, శంకర్‌గౌడ్ పాల్గొన్నారు.

